
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

5 గురువారం 11 జూలై 2024



కంపచెట్ల తొలగింపు తరువాత మంత్రుల భవన సముదాయం



కంపచెట్ల నడుమ హైకోర్టు భవనం, ఐఏఎస్ అధికారుల భవనాలు


- ఐదేళ్ల నిర్లక్ష్యం ఫలితంగా అడవిలా అమరావతి
- 26 వేల ఎకరాల్లో కంపచెట్లతో చిట్టడవిలా రాజధాని
- ప్రభుత్వ భవనాలను కమ్మేసిన కర్రతుమ్మ కంప చెట్లు
- కంపచెట్ల తొలగింపుతోనే నవనగర పునర్నిర్మాణం
- కంపచెట్ల తొలగింపుతో మారుతున్న రూపురేఖలు
- హుందాగా సిద్ధమవుతున్న రాజధాని రహదారులు





● కొత్త సొబగులు అద్దుకున్న ఉద్యోగుల భవన సముదాయం


నాడు అడవిలా.. నేడు అందంగా



● కంపచెట్ల మధ్య క్లాస్-4 ఉద్యోగుల భవన సముదాయం



● కంపచెట్ల మధ్య ఎన్ఐడీ, విట్ విద్యా సంస్థలు



● కంప చెట్లలో కనపడకుండా పోయిన నిర్మాణ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లు

గుంటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): 2019 డిసెంబర్‌లో వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల సిద్ధాంతాన్ని తెరమీదకు తెచ్చి రాజధాని అమరావతి ధ్వంస రచనకు స్వీకారం చుట్టింది. రాజధాని పరిధిలో వున్న 29 గ్రామాలు, రైతులు ఇచ్చిన భూములు అన్నీ గత ప్రభుత్వ వికృత క్రీడలో నాశనమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా కేంద్రంగా ఉండే కోర్ క్యాపిటల్ కర్రతుమ్మ చెట్లతో చిట్టడవిలా మారిపోయింది. కోర్ క్యాపిటల్‌లో సెక్రటేరియట్ టవర్స్ నీటిలో మునిగిపోగా, ఐకానిక్ టవర్స్, అసెంబ్లీ, రాష్ట్ర హైకోర్టు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రులు, న్యాయమూర్తులు, ప్రిన్సిపల్ కార్యదర్శులకు నివాసాలు, ఐఏఎస్ అధికారులు, సెక్రటేరియట్ ఉద్యోగుల కోసం నిర్మించిన భారీ భవన సముదాయాలు కంపచెట్ల పాలయ్యాయి. భవనాల సంగతి ఎలా ఉన్నా నిర్వహణను కూడా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో రోడ్లు, రైతుల ప్లాట్లు సహా ఖాళీ ప్రదేశమంతా తుమ్మచెట్లతో నిండిపోయింది. ప్రభుత్వ భవన సముదాయాలకు వెళ్లే దారులు కూడా కనిపించనంతగా తుమ్మకర్ర పెరిగిపోయింది. కేంద్ర సంస్థలకు కర్రతుమ్మ బెడద తప్పలేదు. విట్, ఎన్ఐడీ వంటి ప్రతిష్టాత్మక కేంద్ర సంస్థలు టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అమరావతిలో తమ కార్యకలాపాలు ప్రారంభించాయి. గడిచిన ఐదేళ్లుగా వేలాది మంది విద్యార్థులు అక్కడ విద్యాభ్యాసం చేస్తున్నారు. ప్రతిరోజూ పదుల సంఖ్యలో విద్యాసంస్థల బస్సులు, వందల సంఖ్యలో ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అయినా సరే రోడ్లు పడలేదు. కర్రతుమ్మ బెడద తప్పలేదు.

● మారుతున్న రూపురేఖలు

అమరావతి అడవిలా మారిపోయిన విషయాన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు చేపట్టారు. ప్రమాణ స్వీకారానికి రెండు రోజుల ముందే జూన్ 11న జంగిల్ క్లియరెన్సుకు టెండర్లు ఆహ్వానించారు. దాదాపు 200 ఎక్స్‌కవేటర్లతో పనులు ప్రారంభించారు. తొలి అడుగుగా ప్రభుత్వ భవనాలు, ప్రధాన రహదారులను చుట్టుముట్టిన కంపచెట్ల తొలగింపుకు పూనుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, శాసన సభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు నెల రోజుల్లో రెండుసార్లు పర్యటించి పనుల తీరును పరిశీలించారు. అధికారులను పరుగులు పెట్టించారు. కేంద్ర పెద్దలను ఒప్పించి అమరావతి కోసం నిధులు మంజూరు చేయించే ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లారు. ప్రభుత్వ చిత్తశుద్ధి కారణంగా గడిచిన నెలరోజుల్లో యుద్ధ ప్రాతిపదికన పనులు సాగుతుండడంతో అమరావతి రూపురేఖలు చాలా వరకూ మారిపోయాయి. కొత్త సొబగులు అద్దుకుంటున్నాయి. నిన్నటి వరకూ దుమ్ము, ధూళితో బూజుపట్టిన ప్రభుత్వ భవనాలు దుమ్ము దులుపుకుని అందంగా ముస్తాబవుతున్నాయి. ఎమ్మెల్యే క్వార్టర్లు, మంత్రుల భవనాలు, ప్రిన్సిపల్ సెక్రటరీల నివాసాలు, క్లాస్-4 ఉద్యోగుల భవన సముదాయాలు దర్జాగా సిద్ధమవుతున్నాయి. తొలగించిన కంప చెట్ల మధ్య ఠీవీగా తలెత్తుకు నిలుచున్నాయి. ఆకాశాన్ని తాకే అద్భుత భవనాలు నవనగరానికి కొత్త శోభనిస్తున్నాయి. సీడ్ యాక్సిస్ రోడ్డు సహా అనేక రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కంపచెట్లను తొలగించి రోడ్లను విస్తరించి తిరిగి పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు ప్రయత్నిస్తోంది. అందమైన రోడ్లు నేడు హుందాగా ప్రజలకు దర్శనమిస్తున్నాయి. రోడ్లకు ఇరుపక్కలా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, వీధి దీపాలు సిద్ధం చేస్తున్నారు. తద్వారా అమరావతిలో కొత్త వెలుగులు రాబోతున్నాయి.

ప్రభుత్వ భవనాల పనులు పురోగమిస్తున్న క్రమంలో క్రమంలో మిగిలిన పనులపై ప్రభుత్వం దృష్టి సారించింది. రాజధాని పరిధిలో 26 ఎకరాల్లో అడవిలా పెరిగిన కంపచెట్ల తొలగింపుపై ప్రభుత్వ దృష్టిపెట్టింది. కంప చెట్ల తొలగింపునకు సంబంధించి 30 కోట్ల రూపాయల వరకూ ఖర్చు అవుతుందని అధికారుల అంచనా వేశారు. టెండర్ల ప్రక్రియలో భారీ కంపెనీలు పాల్గొంటున్నట్లు అధికారుల ద్వారా అందుతున్న సమాచారం. ఈ ప్రక్రియ కూడా ఈ వారంలో పూర్తయ్యే అవకాశం కనిపిస్తోంది. టెండర్లు ఖరారైన నెల రోజుల్లోపు కంపచెట్లను తొలగించి రాజధాని రూపురేఖలు మార్చాలని కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

● 26వేల ఎకరాల జంగిల్ క్లియరెన్సుకు శ్రీకారం

అద్భుత నగరంగా విరాజిల్లాల్సిన అమరావతి ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం నిర్వాకం పుణ్యమా అని అడవిలా మారిపోయింది. వైసీపీ పాలకుల నిర్లక్ష్యానికి బలైపోయింది. గత టీడీపీ ప్రభుత్వం 2014- 19 మధ్య నిర్మించిన ప్రభుత్వ భవనాలు, విద్యాసంస్థలు తప్ప మిగిలిన ప్రాంతమంతా అడవిలా మారిపోయింది. కోర్ క్యాపిటల్‌లో అడుగు స్థలం కూడా ఖాళీ లేకుండా కంప చెట్లు పెరిగిపోయాయి. మొత్తంగా 26వేల ఎక రాల్లో కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఐదేళ్ల లో అడవిలా మారిన అమరావతి కూటమి ప్రభుత్వంలో కొత్త ఊపిరిలు పోసుకుం టోంది. జవసత్వాలు నింపు కుని ఠీవీగా నిలిచేందుకు తపన పడుతోంది. అమరావతిని మింగే సిన కంపచెట్లపైనే కూటమి ప్రభుత్వం ఎక్కుపెట్టింది. కంప చెట్ల తొలగింపుతో నవ్యాంధ్ర పునర్నిర్మాణానికి నాంది పలికింది.



కంపచెట్లు తొలగించిన తర్వాత హైకోర్టుకు వెళ్లే రోడ్డు



● పశ్చిమ డెల్టా హెడ్ రెగ్యులేటర్ వద్ద బటన్ నొక్కి నీరు విడుదల చేస్తున్న మంత్రి రామానాయుడు

చంద్రబాబు దార్శనికతకు ప్రతీక పట్టిసీమ

- జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు
- కృష్ణా పశ్చిమ డెల్టాకు 500 క్యూసెక్కుల నీటి విడుదల

6లో..

రాయితీపై.. సరుకులు

- దేశవాళి కందిపప్పు కేజీ రూ. 160
- నాణ్యమైన స్టీమ్ బియ్యం (బీపీటీ రకం) కేజీ రూ. 49
- రా బియ్యం కేజీ రూ. 48



గుంటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కందిపప్పు, బియ్యం ధరలు రిటైల్ మార్కెట్‌లో ఆకాశాన్నంటుతున్న ప్రస్తుత తరుణంలో వినియోగదారులకు కొంతమేరకు ఆర్థిక ఉపశమనం కలిగించేందుకు పౌరసరఫరాల శాఖ రంగంలోకి దిగింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని రైస్, డాల్‌మిల్లర్లతో ఆ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చర్చలు జరిపిన అనంతరం కొంత రాయితీపై కందిపప్పు, బియ్యంని రైతుబజార్లలో ప్రజలకు అందుబాటులోకి ఉంచేందుకు ముందుకొచ్చారు. రెండు, మూడు రోజుల్లో రాయితీ ధరలను బిగ్‌షైన్ మార్కెట్లలో కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, మూడు జిల్లాల పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ఈ నెల 11వ తేదీ గురువారం గుంటూరు జిల్లాలోని పలు రైతుబజార్లు, బాపట్లలో ఆరు చోట్ల, పల్నాడు జిల్లాలో ఎనిమిది కేంద్రాల్లో సబ్సిడీ కందిపప్పు, బియ్యం విక్రయాలను ప్రారంభిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

కందిపప్పు నేడు రిటైల్ మార్కెట్‌లో రకాన్ని బట్టి రూ. 175 నుంచి రూ. 185 వరకు ఉన్నది. బ్రాండెడ్ కందిపప్పు(గుజరాత్, లాతోర్) అయితే రూ. 200 పైమాటే. మరోవైపు రేషన్ దుకాణాల్లో సబ్సిడీపై తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో విక్రయించిన సబ్సిడీ కందిపప్పుని గత వైసీపీ ప్రభుత్వం నిలిపేసింది. దీంతో చాలా మంది కందిపప్పు వాడకాన్ని తగ్గించేశారు. ప్రత్యామ్నాయంగా ఎర్రపప్పు, పెసరపప్పుని వినియోగిస్తున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కేవలం నెల రోజులు మాత్రమే అయ్యాయి. ఇప్పటికిప్పుడు రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీ కందిపప్పుని అందుబాటులోకి తీసుకురాలేని పరిస్థితి. ఇందుకు కారణం పౌరసరఫరాల సంస్థ గిడ్డంగులని తనఖా పెట్టి గత వైసీపీ ప్రభుత్వం పెద్ద మొత్తంలో అప్పులు చేసింది. ఇవన్నీ ఒక కొలిక్కి తీసుకొచ్చి అప్పులపై శ్వేతపత్రం విడుదల చేసిన అనంతరం కందిపప్పుని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో కేజీ కందిపప్పు రూ. 130కి సరఫరా చేసేందుకు పల్నాడు జిల్లాలోని డాల్‌మిల్లర్లు ముం దుకు రాగా వారి నుంచి కొనుగోలు చేయకుండా ప్రజలను ఇబ్బందులు పాలు చేసింది.

ఈ నేపథ్యంలో రైతుబజార్లలో దేశవాళి కందిపప్పుని వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి మనోహర్ ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు కేజీ కందిపప్పు రూ. 160, నాణ్యమైన స్టీమ్ బియ్యం(బీపీటీ వెరైటీ) కేజీ రూ. 49, రా రైస్ కేజీ రూ. 48కి ప్రత్యేక కౌంటర్లలో విక్రయించనున్నారు. గుంటూరు నగరంలోని చుట్టుగుంట, ఆర్టీసీ బస్టాండ్, తెనాలిలో ఉన్న రెండు, మంగళగిరి, పొన్నూరులో ఉన్న రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్లని గురువారం ఉదయం నుంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తారు. అలానే గుంటూరు నగరంలోని 15 పప్పుల హోల్‌సేల్ దుకాణాలలో కూడా దేశవాళి కందపప్పు, రైస్‌మిల్ పాయింట్ల వద్ద బీపీటీ బియ్యం పైన పేర్కొన్న ధరలకు అందుబాటులో ఉంచనున్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. చిలకలూరిపేటలో రైతుబజార్, మరో కేంద్రం, వినుకొండ, నరసరావుపేట, పిడుగురాళ్లలో రెండు కౌంటర్లు చొప్పున ఏర్పాటు చేశారు. ఇవి ఎక్కువగా ఎంపీడీవో /తహసీల్దార్ కార్యాలయాలు, ఆర్యవైశ్య కల్యాణ మండపాల్లో ఏర్పాటు చేశారు. బాపట్ల, వేమూరు, చీరాల, రేపల్లెలోనూ ఆరు కౌంటర్లు ఏర్పాటు చేశారు. వీటిని మంత్రులు /ఎమ్మెల్యేలు గురువారం ఉదయం ప్రారంభిస్తారు.

నగర వనాలను పర్యాటక ప్రాంతాలుగా చేయాలి

● అటవీశాఖ అధికారుల సమీక్షలో కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి, పేరేచర్లలోని నగరవనాలను పర్యాటక ప్రదేశాలుగా మరింత వినూత్నంగా అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలపై ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. ఇందుకు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులు వినియోగించాలన్నారు. అటవీ, క్రీడాభివృద్ధి, ఏపీ టూరిజం, సాంస్కృతిక శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో బుధవారం కలెక్టరేట్‌లో ఆమె సమీక్షించారు. పర్యాటక, సాంస్కృతిక శాఖపై సమీక్షిస్తూ శిల్పారామానికి కేటాయించిన మిగిలిన స్థలంలో అభివృద్ధి పనులు చేపట్టాలని, గుర్రం జాషువా కళా ప్రాంగణం నిర్మాణ పనులు పూర్తి అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. లక్ష్మీపురంలోని పద్మవిభూషణ్ డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ నృత్య, సంగీత కళాశాల శాశ్వత భవనానికి అవసరమైన నిధులు, స్థల సేకరణ చేపట్టాలని సూచించారు. ఉండవల్లి గుహల దగ్గర పార్కింగ్, వసతి ఏర్పాటు చేసే విధంగా చూడాలని, ఉప్పలపాడు పక్షుల కేంద్రంలో మరిన్ని సౌకర్యాలు పెంపొందించే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఖేలో ఇండియా పథకం కింద స్టేడియంని అభివృద్ధి చేసేందుకు అవకాశాలు ఉన్నట్లు డీఎస్‌డీవో నరసింహారెడ్డి తెలిపారు. సమీక్షలో డీఎఫ్‌వో మహబూబ్‌బాష, జిల్లా పర్యాటక అధికారి నాయుడమ్మ పాల్గొన్నారు.




అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

చేరని ఇంటికి.. రూ.71 వేల వడ్డీ

- టిడ్కో లబ్ధిదారులకు బ్యాంకుల నోటీసులు
- 60 రోజుల్లో బకాయిలు చెల్లించాలని హెచ్చరిక

గుంటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నాన్చినాన్చి.. పాడుపెట్టి.. లబ్ధిదారుల ఆశలను నీరుగార్చి.. ఎన్నికలకు ముందు పట్టాల పంపిణీతో టిడ్కో లబ్ధిదారులను వైసీపీ ప్రభుత్వం వంచించింది. టిడ్కో ఇళ్ల పేరుతో రుణాలు పొందిన ప్రభుత్వం ఆ నిధులను ఏమి చేసిందో ఏమో కానీ బ్యాంకుల నుంచి భారీగా వడ్డీ బకాయిలు చెల్లించాలంటూ తాజాగా నోటీసులు జారీ అవుతున్నాయి. తాము ఇళ్లలోకి కూడా చేరలేదు.. ఈ వడ్డీల భారం ఏమిటంటూ టిడ్కో లబ్ధిదారులు మండిపడుతున్నారు. గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెంలో నిర్మించిన టిడ్కో భవన సముదాయాల్లో నగరంలోని వేర్వేరు ప్రాంతాల లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించారు. అయితే అక్కడ నివాసం ఉండడానికి విద్యుత్, తాగునీరు, డ్రెయినేజీ వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదు. దీంతో లబ్ధిదారులు ఫ్లాట్లలో నివాసం ఉండేందుకు వెళ్లలేకపోయారు. అయినా లబ్ధిదారులకు రుణం మంజూరు చేసిన బ్యాంకులు మాత్రం తమకు లోన్ ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లించాల్సిందేనని ఒత్తిడి చేస్తున్నాయి. స్థానిక శ్రీనివాసరావుపేటలోని నైజాంబజార్, మాచర్ల వారి వీధి తదితర లైన్లలో లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి తాజాగా నోటీసులు అందాయి. మీరు బ్యాంకు నుంచి రూ.3.65 లక్షల రుణం తీసుకున్నారు.. ఇప్పటివరకు 8.25 శాతం చొప్పున వార్షిక వడ్డీ కలిపితే రూ.4 లక్షల 35 వేల 927 అయిందని ఆ నోటీసులో పేర్కొన్నాయి. నోటీసు అందిన 60 రోజుల్లో బకాయిలు చెల్లించకుంటే సంబంధిత టిడ్కో ఫ్లాట్‌ని తమ ఆధీనంలోకి తీసుకుంటామని బ్యాంకులు హెచ్చరించాయి. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం స్థానిక టీడీపీ నాయకుడు నైజాంబాబు ఈ విషయాన్ని ఎమ్మెల్యే గళ్లా మాధవి దృష్టికి తీసుకెళ్లారు.



SCHEDULE OF THE PROPERTY
SCHEDULE-A

Guntur District Registration, Nallapadu Sub-Registration, within the limits of Guntur (Municipality/Municipal Corporation/Gram panchayat) Vengalayapalem area, Sy No.s: 1197-2, 1197-3, 1195-A1 1195/A3, 1195A4,1195A5 1195A/6, 1195/8A, 1195-A9, 1095/A10,1195/A11, 1195/A12,1195/A14 1195/A15, 1195/A16,1195/A17, 1195/A18,1195/A19,1195/A20,1195/A21, A... VENGALAYAPALEM GUNTUR extent of Ac.60.595 cents of land. RC.NO.4420/2018-1 Dt.02.11.2018 ... Extent of AC60.595 cts.

SCHEDULE -B
(Details of security assets)


Sl No	Movable	Name of Title holder
1	NIL	NA
	Immovable	
2	EMT of one flat in Block No: C69 Flat No: G4 in Ground floor, admeasuring 430.00 Sq. Feet (including proportionate share in common area in Sy No: 1195-A1 1195/A3, 1195A4,1195A5 1195A/6, 1195/8A, 1195-A9, 1095/A10,1195/A11 1195/A12,1195/A14 1195/A15, 1195/A16,1195/A17, 1195/A18,1195/A17,1195/A20,1195/A21, 1183/5, 1183-6,1183-9,1183-10, 1183-11, AT VENGALAYAPALEM GUNTUR Extent of Ac.60.595 cents of land. RC NO.4420/2018-1 Dt.02.11.2018 on Extent of AC 60.595 cts. BLOCK BOUNDARIES (C69 BLOCK) NORTH: 9.0 Mts Wide Road SOUTH: Block No.C62 EAST: Block no.C68 WEST: OPEN SPACE BOUNDARIES OF FLAT NO.F5 in First Floor NORTH: 9.0 Mts. Wide Road SOUTH: Flat No.GF 3 (Block No. C69) EAST: Flat No. GF1 (Block No.C69) WEST: Flat No.GF5 (Block No.C69)	SMT. BIBULA

SCHEDULE - C
[Details of liability as on date]

SL NO	LOAN NO	NATURE OF LOAN/LIMIT	LIABILITY WITH INTEREST AS ON DATE (RS.)
1	160000271586	HL-APTIDCO	₹4,35,957/-

● శ్రీనివాసరావుపేటలో టిడ్కో ఇంటి లబ్ధిదారుడికి బ్యాంకు జారీ చేసిన నోటీసు

ప్రజలకు అందుబాటులో కావాల్సినంత ఇసుక


ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, జూలై 10: కూటమి ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన విధానంతో ప్రజలందరికీ స్థానికంగానే కావాల్సినంత ఇసుక అందించే అవకాశం లభించిందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ హయాంలో ట్రక్కుకు రూ.20 వేలు, ఆపైన కూడా పెట్టిన పరిస్థితులున్నాయన్నారు. ప్రస్తుతం తమ ప్రభుత్వంలో నామమాత్రపు ధరకే ఇసుక అందిస్తున్నామన్నారు. సామాన్య మధ్యతరగతికి అతిపెద్ద ఊరటన్నారు. పల్నాడు జిల్లాలో వైకుంఠపురం, కోనూరు, కొత్తపల్లి, మాదిపాడు, వినుకొండ, కొండమోడు స్టాక్ యార్డుల్లో సరఫరాకు ఇసుక నిల్వలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలు మాత్రమే చెల్లించి కోటా మేరకు ఇసుక తీసుకోవచ్చని ప్రజలకు తెలిపారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి అమలు చేసిన దుర్మార్గపు విధానాలు రద్దు చేయడం ద్వారానే ఇది సాధ్యమైందన్నారు. ఇకపై దళారీలకు వేల రూపాయలు కప్పం కట్టాల్సిన పని లేదని, ఇసుక దొరుకుతుందో లేదో ఇంటి పనులు ముందుకు సాగుతాయో లేదో అన్న భయాలు ఇక అవసరం లేదన్నారు. దీని ద్వారా భవన నిర్మాణ కార్మికులు ఆ రంగంపై ఆధారపడిన ఇతర విభాగాల వారు ఉపాధి, వ్యాపార అవకాశాల విషయంలో బెంగ పెట్టుకోనక్కర్లేదన్నారు. ఇసుక విషయంలో ఊరటనిచ్చిన సీఎం చంద్రబాబుకు ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు తెలిపారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ బ్యాటరీలు చోరీ

గుంటూరు, జూలై 10: నగరం నడిబొడ్డున హిందూ కళాశాల కూడలిలో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ కోసం ఏర్పాటుచేసిన బ్యాటరీలను దొంగలు అపరిచిపోయారు నిత్యం వ్యాధి వాహనాల రాకపోకలు సాగించే ఈ ప్రధాన జంక్షన్ లో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ కు సంబంధించిన పోల్స్ కు ఏర్పాటు చేసిన బ్యాటరీలను దొంగలు అపహరించడం కలకలం రేపింది. గుంటూరు నగరంలోని అత్యంత ట్రాఫిక్ రద్దీ కలిగిన ప్రదేశం హిందూ కళాశాల కూడలి. అక్కడ పగలే కాకుండా రాత్రివేళ కూడా వాహన రాకపోకలు కొనసాగుతుంటాయి. అయితే అటువంటి సెంటర్ లో దొంగలు బ్యాటరీలు అపహరించుకుపోవడం గమనార్హం. ఈ ప్రాంతంలో సిగ్నల్ లైట్స్ కోసం మూడు రోజుల క్రితమే ట్రాఫిక్ పోలీసులు కొత్తగా మూడు బ్యాటరీలు అమర్చారు. అయితే బుధవారం ఉదయం ట్రాఫిక్ పోలీసులు వచ్చి చూడగా సిగ్నల్స్ వెలగడం లేదు. దీంతో బాక్సులను తెరిచి చూడగా అందులో ఉండాల్సిన బ్యాటరీలు కనిపించలేదు. పోలీసుల ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు ఇక్కడ ఉన్న సీసీ కెమెరాలు కూడా పనిచేయకపోవడం పట్ల సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

చంద్రబాబు దార్శనికతకు ప్రతీక పట్టిసీమ

- జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు
- కృష్ణా పశ్చిమ డెల్టాకు 500 క్యూసెక్కుల నీటి విడుదల


నీటి విడుదల అనంతరం పసుపు, కుంకుమ సారెను వదులుతున్న మంత్రి నిమ్మల

తాడేపల్లి టౌన్, జూలై 10: సీఎం చంద్రబాబు దార్శనికతకు, ముందుచూపునకు నిదర్శనమే పట్టిసీమ ప్రాజెక్టు అని రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ప్రకాశం బ్యారేజి వద్ద పశ్చిమ హెడ్ రెగ్యులేటర్ నుంచి బుధవారం బటన్ నొక్కి మంత్రి నీటిని వదిలారు. ఒక గేటును 2 అడుగుల మేర ఎత్తి 500 క్యూసెక్కుల నీటిని తాగు, సాగునీటి అవసరాల కోసం పశ్చిమ డెల్టాకు విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కృష్ణానది జలాలు ఆల్‌మట్టి నుంచి నాగార్జున సాగర్‌కు వచ్చే సరికి ఆగస్టు 2వ వారమవుతుందన్నారు. ఈ లోపు జూలైలో తాగునీటి అవసరాలు తీర్చడానికి, ఖరీఫ్ సీజన్ తొందరగా ప్రారంభించి ఆరుమడి వేసుకోవడానికి పులిచింతల బాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించుకున్నామన్నారు. ఏ ప్రభుత్వం ఉన్నా ఆ రిజర్వాయర్‌లో 30-40 టీఎంసీల నీటిని రిజర్వు చేసుకుని జూలైలో కృష్ణా డెల్టాకు విడుదల చేస్తుంటారని చెప్పారు. పులిచింతలలో 30 టీఎంసీల మాట అటుంచి కనీసం అర టీఎంసీ నీరు కూడా నిల్వ పెట్టలేదన్నారు. నీటిని వృథాగా సముద్రంలోకి వదిలివేసి కృష్ణా డెల్టా ప్రజలకు జగన్ ద్రోహం చేశారని విమర్శించారు. ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలని, దాన్ని ఆఖరి ఎకరా వరకు తీసుకెళ్లాలని సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు తాము నడుచుకుంటున్నట్లు చెప్పారు. నాలుగేళ్ల నుంచి నిర్వహణ లేకపోయినా పట్టిసీమ వద్ద యుద్ధప్రాతిపదికన తుప్పు పట్టిపోయిన మోటార్లకు మరమ్మతులు నిర్వహించి గోదావరి జలాలను కృష్ణమ్మ చెంతకు తీసుకువచ్చినట్లు చెప్పారు. పట్టిసీమ పురుషోత్తమపట్నం, తాడిపూడిలను చక్కబెట్టుకుంటూ వచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ ఇంజనీరింగ్ చీఫ్ నారాయణరెడ్డి, ఎస్ఈ ఉమామహేశ్వరరావు, ఈఈ మల్లికార్జునరావు, డీఈ ప్రసాద్, బ్యారేజి జేఈ దినేష్, ఏఈ వనిత, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్య, తాడేపల్లి పట్టణ, మండల టీడీపీ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, అమరా సుబ్బారావు, మండవ గోపాలరావు, మండల జనసేన అధ్యక్షుడు సామల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గడ్డం గ్యాంగ్‌పై చర్యలు తీసుకోండి

ప్రజాదర్బార్‌కు రాష్ట్ర వ్యాప్తంగా అర్జీదారుల రాక.. ● ఓపిగ్గా సమస్యలు వింటూ భరోసా ఇస్తున్న మంత్రి లోకేశ్


అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

తాడేపల్లి, జులై 10: రాష్ట్ర ఐటిశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రవేశపెట్టిన ప్రజాదర్బార్‌కు రాష్ట్రవ్యాప్తంగా స్పందన లభిస్తోంది. అన్ని ప్రాంతాల నుండి పలువురు అర్జీదారులు తమ సమస్యలు చెప్పుకునేందుకు ఉండవల్లిలోని లోకేశ్ ఇంటి వద్దకు రావడంతో కరకట్టపై భారీగా బారులు తీరిన ప్రజలు కనబడుతున్నారు. ఉదయం 5 గంటలకే అర్జీదారులు వస్తుండడంతో కరకట్ట ప్రాంతం కళకళలాడుతోంది. దివ్యాంగులు సైతం లోకేశ్ భరోసా కోసం ఆశగా అర్జీలు తీసుకుని తమ కుటుంబసభ్యులతో లోకేశ్‌ను కలిసి సమస్యలు విన్నవిస్తున్నారు. లోకేశ్ ఓపిగ్గా అర్జీదారుల సమస్యలు విని పరిష్కారానికి భరోసా ఇస్తూ వాటిని సంబంధిత శాఖలకు పంపిస్తున్నారు. పలువురు ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని, అనారోగ్యంతో బాధపడుతున్నామని ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అన్యాక్రాంతమైన భూముల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

కృష్ణా జిల్లా గుడివాడలో గడ్డం గ్యాంగ్ ఆగడాలకు తీవ్రంగా నష్టపోయాయనని సదరు గ్యాంగ్‌పై చర్యలు తీసుకోవాలని ముసునూరు హరికృష్ణ మంత్రి లోకేశ్‌ను కలిసి ఫిర్యాదు చేశాడు. ఏపి స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ సంస్థలో ఎంఎస్‌వోగా, ఆపరేటర్‌గా పని చేస్తున్నానని, 2017లో ఏపి టిడ్కో గృహాలకు ఫైబర్ నెట్ ప్రసారాలు అందించాలని అప్పటి ప్రభుత్వం ఆదేశించింది. దీంతో సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని 50లక్షల వ్యయంతో వైరింగ్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రసారాలు అందించానని వైసీపీ ప్రభుత్వం వచ్చాక అప్పటి గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని అండతో గడ్డం గ్యాంగ్ రంగంలోకి దిగి ఫైబర్‌నెట్ సిగ్నల్ వ్యవస్థకు విద్యుత్ ప్రసారం కాకుండా అడ్డుకుని తనను తీవ్రంగా వేధించి వైర్లను ధ్వంసం చేసి నష్టపరిచారని వారిపై చర్యలు తీసుకుని తనకు రక్షణ కల్పించాలని హరికృష్ణ కోరారు. చర్యలు తీసుకుంటామన్న లోకేశ్ హరికృష్ణకు భరోసా ఇచ్చారు. మూడు దశాబ్దాలుగా మంగళగిరి ఏపిఎస్‌పి బెటాలియన్ వద్ద నివసిస్తున్న తమకు దారి సమస్య ఉందని పరిష్కరించాలని ఏపిఎస్‌పి విశ్రాంత ఉద్యోగులు లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. స్టేట్ పోలీస్ అసోసియేషన్ ఎన్నికల కాలపరిమితి ముగిసినందున తిరిగి ఎన్నికలు నిర్వహించాలని మంగళగిరి 6వ బెటాలియన్ సిబ్బంది కోరారు. సీపీఎస్ విధానం అమలు తేదీ కంటే ముందే నియామక పత్రాలు పొందిన తమకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని 2003 బ్యాచ్ పోలీసు కానిస్టేబుళ్లు విజ్ఞప్తి చేశారు. పవులూరు దివ్యాంగులు తమ సమస్యలను లోకేశ్ దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పలువురు తమ సొంత సమస్యలతో లోకేష్‌ను కలువగా వారి సమస్యల పరిష్కారానికి తగిన ఆదేశాలు జారీ చేశారు.

సూర్యలంక తీరానికి పర్యాటకులకు అనుమతి

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన.. చిరువ్యాపారుల హర్షం

బాపట్ల, జూలై 10 : ప్రముఖ పర్యాటక కేంద్రం సూర్యలంక సముద్ర తీరంలో పర్యాటకుల రాకపోకలను గత నెల 24వ తేది నుంచి తాత్కాలికంగా నిషేధించారు. వరుస ప్రమాదాల నేపథ్యంలో పర్యాటకుల రాకపోకలను పోలీసు అధికారులు నిలిపివేయటంతో చిరువ్యాపారుల జీవనం అస్తవ్యస్థంగా మారింది. ఈ విషయమై బుధవారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన సూర్యలంక తీరంలో దుకాణాల మూత, కొనసాగుతున్న పర్యాటకుల నిషేధం, నిర్మానుష్యంగా సముద్రతీరం, చిరువ్యాపారులపై తీవ్రప్రభావం అంటూ వెలువడిన కథనంపై జిల్లా పోలీసు అధికారులు స్పందించారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు డీఎస్పీ సీహెచ్ మురళీ కృష్ణ ఆధ్వర్యంలో రూరల్ సీఐ శ్రీహరి పర్యవేక్షణలో పర్యాటకులకు అనుమతినిచ్చారు. దీంతో సూర్యలంక తీరానికి బుధవారం నెమ్మదిగా పర్యాటకుల రాకపోకలు సాగాయి. పోలీసులు అనుమతిచ్చారని తెలుసుకున్న పర్యాటకులు, చిరువ్యాపారులు సంతోషంతో సూర్యలంక తీరానికి వచ్చి స్నానాలు చేస్తూ సందడి చేశారు. పర్యాటకులు మద్యం సేవించి సముద్రంలోకి వెళ్ళరాదని లోతుకు వెళ్ళి ప్రమాదాలు తెచ్చుకోవద్దుఅని రూరల్ సీఐ శ్రీహరి తెలిపారు.


సూర్యలంక సముద్రతీరంలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

పున్నమ్మ చెరువు.. కబ్జా

అనుమతులు లేకుండా కల్యాణ మండప నిర్మాణం ● సీఆర్‌డీఏ అధికారులు నోటీసులు జారీ చేసినా ఆగని పనులు ● వైసీపీ హయాంలో రాజ్యసభ సభ్యుడితో అధికారులపై ఒత్తిళ్లు ● అక్రమ నిర్మాణాల వద్ద తాజాగా టీడీపీ ఎమ్మెల్యే, మంత్రుల ఫ్లెక్సీలు


పున్నమ్మచెరువులో నిర్మిస్తున్న కళ్యాణ మండపం

తాడికొండ, జూలై 10: వందేళ్ల క్రితం ప్రజలు, బాటసారుల దాహర్తి తీర్చడానికి ఏర్పాటు చేసిన పున్నమ్మ చెరువు కబ్జాకు గురైంది. 23 సెంట్ల స్థలంలోని చెరువు కబ్జా కోరల్లో చిక్కుకుని కనుమరుగైంది. ఎలాంటి అనుమతులు లేకుండా చెరువు స్థలంలో కల్యాణ మండపాన్ని నిర్మిస్తున్నారు. చెరువును పూడ్చివేసి ప్రహరి నిర్మించినా రెవెన్యూ, పంచాయతీ అధికారులు కన్నెత్తి చూడలేదు. సీఆర్‌డీఏ అధికారులకు ఫిర్యాదులు అందడంతో తప్పని పరిస్థితుల్లో నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చారు. రాజధానికి సింహద్వారంగా ఉన్న తాడికొండ అడ్డరోడ్డులో భూములు ధరలు రూ.కోట్లు పలుకుతున్నాయి. సర్వే నెంబరు 12లో 4 ఎకరాల భూమిని కొనుగోలు చేసిన వ్యక్తి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అండగల్, 1బీ, పాస్‌పుస్తకాలు లేకుండానే, లాండ్ కన్వర్షన్ చేయకుండానే పొలంలో అక్రమ నిర్మాణాలకు తేరలేపారు. అక్రమ నిర్మాణాలు చేయటంతో పాటు, చెరువును ఆక్రమించిన వ్యక్తిపై పలువురు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా సరే ఇంత వరకు అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడలేదు.

● వైసీపీ ప్రభుత్వం హయంలో రాజ్యసభ సభ్యుడి సహకారంతో అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి నిర్మాణాలను అడ్డుతగలకుండా చేయించారని గతంలో పని చేసిన అధికారులు చెప్తున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ నాయకులతో అంటకాగిన అక్రమ నిర్మాణదారుడు.. కూటమి అధికారంలోకి రావడంతో టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు ఫోటోలతో కూడిన ఫ్లెక్సీని చెరువు వద్ద ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేలతో సన్నిహితంగా ఉన్న ఫొటోలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంపై టీడీపీ నాయకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. చెరువు కబ్జాపై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా రికార్డులో అక్కడ చెరువు లేదని చెప్పారు. పున్నమ్మ చెరువు ఆక్రమణపై సీపీఐ పోరాటాలు చేస్తునే ఉన్నది. చెరువును కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేయడంపై సీఆర్‌డీఏ అధికారులు రెండు సార్లు నోటీసులు జారీ చేశారు. అధికారులు నోటీసులు జారీ చేసినా నిర్మాణాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి.

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు జీరో స్థాయికి చేరాలి

- సాంకేతిక లోపాల్లేకుండా చర్యలు తీసుకోవాలి
- వినియోగదారుల ఫిర్యాదులకు వెంటనే స్పందించాలి
- గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ మురళీకృష్ణయాదవ్

గుంటూరు, జూలై 10: విద్యుత్ సరఫరాలో ఇకపై అంతరాయాలు జీరో స్థాయికి చేరాలని గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ ఆవుల మురళీకృష్ణ యాదవ్ ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలు, నిర్వహణపై బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో గుంటూరు టౌన్-1 ఈఈ టి శ్రీనివాసబాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్‌సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాల్సిన బాధ్యత అన్ని స్థాయిల్లో ఉండాలన్నారు. వోల్టేజ్‌లో హెచ్చు, తగ్గులు, అంతరాయాలు, లోడ్ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తలెత్తే సాంకేతిక లోపాలను పూర్తిస్థాయిలో అరికట్టాలన్నారు. దీనిపై సెక్షన్ పరిధిలోని క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి అధికారుల వరకు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. విద్యుత్ లోడ్‌కు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులపై అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం ప్రదర్శిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.

అక్రమంగా గ్రావెల్ తరలింపు

తుళ్లూరు, జూలై 10: అనంతవరం నుంచి యథేచ్ఛగా గ్రావెల్ తరలుతుంది. గత వారం నుంచి మోతడక వెంచర్లకు అనంతవరం కొండ ప్రాంతం నుంచి కర్లపూడి మీదగా గ్రావెల్ వెళుతుంది. ఎక్స్‌కవేటర్‌తో తవ్వి లారీలకు లోడు చేస్తున్నారు. అనుమతులు లేకుండా గ్రావెల్‌ను తరలిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. దీనిపై మైనింగ్ డీడీ చంద్రశేఖర్‌ని వివరణ కోరగా, మైనింగ్ విజిలెన్స్ ఏడీ శివాజీని సంప్రదించాలన్నారు. ఆయనను వివరణ అడిగితే డీడీతో చెప్పాలన్నారు. ఇలా ఒకరి మీద ఒకరు చెప్పుకోవటం గమనార్హం.


మోతడక వెంచర్లకు కంకర తోలుతున్న గ్రావెల్ లారీలు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121, 129,140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00



వర్సిటీ మెయిన్ గేట్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి జేఏసీ నాయకులు

వర్సిటీలో అక్రమాలపై సిట్‌తో విచారణ చేయాలి

విద్యార్థి జేఏసీ నాయకుల ధర్నా.. డిమాండ్

పెదకాకాని, జూలై 10: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన అవినీతి అక్రమాలపై సిట్ కమిటీ ద్వారా విచారణ చేయాలని విద్యార్థి జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వర్సిటీ మెయిన్ గేటు దగ్గర నిరసన ప్రదర్శన, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థి జేఏసీ రాష్ట్ర నాయకులు రాయపాటి జగదీష్ మాట్లాడుతూ 2019 నుంచి 2024 జూన్ వరకు వర్సిటీలో రూ.30 లక్షలు వరకు నిబంధనలకు విరుద్ధంగా వీసీ మంజూరు చేశారన్నారు. వర్సిటీలో విద్యార్థుల కోసం అభివృద్ధి చేయాల్సిన నిధులను పందికొక్కుల్లా పంచుకున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి ఆదేశాలతో వర్సిటీ నిధులన్నీ కూడా పక్కదోవ పట్టాయన్నారు. ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్లో మట్టికి కూడా బిల్లులు పెట్టి లక్షల్లో శాంక్షన్ చేసుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని 14 యూని వర్సిటీలపై విచారణకు సిట్ కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్‌ను కోరారు. ఆంధ్ర యూనివర్సిటీ ప్రసాద్‌రెడ్డి దగ్గర నుంచి నాగార్జున యూనివర్సిటీ రాజశేఖర్ వరకు అందరిపైనా చర్యలు తీసుకోవాలన్నారు. సేవ్ నాగార్జున యూనివర్సిటీ పేరుతో ఎమ్మెల్యేలకు, మంత్రులకు వినతిపత్రాలు అందిస్తామన్నారు. గెస్ట్ ఫ్యాకల్టీ ఔట్‌సోర్సింగ్ నియామకాలపై కూడా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వర్సిటీలో విగ్రహాల ఏర్పాటులో కూడా అవినీతి జరిగిందన్నారు. కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ జిల్లా అధ్యక్షులు నంబూరు శాస్త్రి, నంబూరు రాజేష్, రాము, శ్యామ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మాచర్లటౌన్, జూలై 10: టీ తాగేందుకు వచ్చి రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన పట్టణంలోని చెన్నకేశవకాలనీ సమీపంలో బుధవారం జరిగింది. మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన బొంతగాని శ్రీనివాసరావు గౌడ్(45) గ్రామంలో టెంట్‌హౌస్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఉదయాన్నే టెంట్ హౌస్ తెరిచి టీ తాగేందుకు మాచర్లకి కాలినడకన బయలుదేరాడు. మార్గమధ్యలో చెన్నకేశవకాలనీ వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొంది. శ్రీనివాసరావు గౌడ్ కిందపడిపోగా అతడిపై నుంచి వాహనం వెళ్లడంతో తల ఛిద్రమైంది. పట్టణ సీఐ బొప్పన బ్రహ్మయ్య సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడికి భార్య అనూష, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

అమరావతిలో 10 కేజీల గంజాయి స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, ద్విచక్రవాహనం

అమరావతి, జూలై 10: అమరావతి మండలం దిడుగు గ్రామంలో బుధవారం పది కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని సత్రం మర్రి చెట్టువద్ద స్థానిక పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్ర వాహనంపై గంజాయి ప్యాకెట్లను తీసుకెళ్తున్న ఇద్దరు యువకులను గుర్తించారు. వారిని విచారించగా దిడుగు గ్రామానికి చెందిన దున్నా ప్రభుదాసుకు ఇచ్చేందుకు గంజాయిని తీసుకువస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలానికి చెందిన ఆడెంగుల రవికుమార్, గెర్ల బాబు తెలిపారు. దిడుగు గ్రామానికి చెందిన ప్రభుదాసు పాడేరుకు చెందిన ఇద్దరితో గంజాయి వ్యాపారం చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. సీఐ మంగారావు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన కౌలు రైతు మృతి

దుర్గి, జూలై 10: అప్పుల భారంతో ఆత్మహత్యకు యత్నించిన దుర్గి మండలం శ్యామరాజపురానికి చెందిన కౌలు రైతు యండ్ర పోతురాజు(50) బుధవారం మృతి చెందాడు. పదెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేశాడు. పంటలు సరిగా పండక, సరైన దిగుబడి రాకపోవడంతో రూ.10 లక్షల దాకా అప్పులయ్యాయి. అప్పు తీర్చే మార్గం కనిపించక మనస్థాపంతో సాగు చేస్తున్న పొలంలోనే ఈ నెల 3న పురుగుమందు తాగాడు. గుర్తించిన కుటుంబసభ్యులు నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య వెంకట్రావమ్మ, ముగ్గురు సంతానం ఉన్నారు.

దాడి కేసులో శిక్ష ఖరారు

నరసరావుపేట లీగల్, జూలై 10: దాడి కేసులో నేరం రుజువవ్వడంతో నిందితుడు చిలకలూరిపేటకు చెందిన దారా బాబుకు దిగువ కోర్టు విధించిన రెండేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానాను ఖరారు చేస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా కోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. నిందితుడు 2018 జూలై 15న స్వల్ప వివాదం నేపథ్యంలో తను ఉండే ప్రాంతానికి చెందిన గోనుగుంట్ల వెంకయ్యపై దాడి చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న చిలకలూరిపేట పట్టణ పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడ్ని అరెస్టు చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువవ్వటంతో శిక్ష విధిస్తూ చిలకలూరిపేట కోర్టు తీర్పు వెలువరించింది. నిందితుడు జిల్లా కోర్టులో అప్పీలు చేసుకోగా ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయ స్థానం దిగువ కోర్టు తీర్పును ఖరారు చేసింది. ప్రాసిక్యూషన్‌ను ఏపీపీ మల్లారెడ్డి నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నాదెండ్ల, జూలై 10: గుంటూరు - కర్నూలు రహదారిపై సాతులూరు గ్రామ పరిధిలో జరిగిన ప్రమాదంలో కోరుమళ్ళ వెంకట రమణ(26) అనే యువకుడు మృతి చెందాడు. ప్రకాశం జిల్లా పెద అరవీడు మండలం రామాయపాలేనికి చెందిన వెంకటరమణకు భట్టిప్రోలుకు చెందిన చింతగింజల దివ్యశ్రీతో ఐదు నెలల క్రితం వివాహం జరిగింది. ఈ క్రమంలో శుభ కార్యక్రమంలో పాల్గొనేందుకు భట్టిప్రోలు వచ్చిన భార్యభర్తలు బైక్‌పై రామాయపాలేనికి మంగళవారం రాత్రి బయలు దేరారు. సుమారు 11 గంటల సమయంలో నరసరావుపేట నుంచి ఎదురు వస్తున్న ఆటో వారి బైక్‌ను సాతులూరు జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో వీరిని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకట రమణ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన భార్య దివ్యశ్రీని 108లో నరసరావుపేట తరలించారు. నాదెండ్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుజ్జనగుండ్ల పార్కును అభివృద్ధి చేస్తా

● పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): గుజ్జనగుండ్ల పార్కును అభివృద్ధి చేస్తానని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధ వి హామీ ఇచ్చారు. గుజ్జనగుండ్ల పార్కును బుధవారం ఆమె పరిశీ లించారు. స్థానికులు పార్కుకు సంబంధించి పలు సమస్యలు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా పార్కులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉండటం వల్ల ఇబ్బందిగా ఉందని, దానిని పార్కు బయట ఏర్పాటు చేయించాలని ఎమ్మెల్యే గళ్లా మాధవిని కోరారు. ఆమె మాట్లాడుతూ విద్యుత్ శాఖ అధికారులతో ట్రాన్స్‌ఫార్మర్ విషయం మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఆమె హామీనిచ్చారు.

త్వరితగతిన రోడ్లు, డ్రెయిన్ల సమస్యలను పరిష్కరించాలి

పశ్చిమ నియోజకవర్గంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, గుంతల సమస్యల ను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే గళ్లా మాధవి అధికారులను ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయంలో బుధవారం మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె నియోజకవర్గంలో జరిగిన రోడ్లు, డ్రెయిన్ పనులు, పెండింగ్ పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల టెండర్లు పొంది సంవత్సర కాలం దాటినా కూడా ఈ రోజు వరకు పనులను ఎందుకు ప్రారంభించలేదని ఆమె అధికారులను ప్రశ్నించారు. టెండరుదారులు స్పందించకుంటే రీటెండర్‌కు పిలవాలని ఆమె ఆదేశించారు. ప్రధాన రహదారుల్లో గుంతలను వెంటనే పూడ్చాలన్నారు. పారిశుధ్యం విషయంలో రాజీపడబోనని తేల్చి చెప్పారు. ప్రతి వీధి దీపం వెలగాలని ఎమ్మెల్యే మాధవి ఆదేశించారు.



నూతన సభ్యులతో ఎమ్మెల్యే గళ్లా మాధవి తదితరులు

రోటరీ సేవా భావాన్ని మరింత విస్తృతం చేయాలి

గుంటూరు(విద్య), జూలై 10 : రోటరీ క్లబ్‌ల ద్వారా ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పోలియో నిర్మూలన అంశం చాలా గొప్పదని, ప్రభుత్వాలు సైతం చేయలేని పని రోటరీ క్లబ్ చేయడం హర్షణీయమని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. ఆర్టీవో కార్యాలయ రోడ్డులోని ఓ హోటల్‌లో రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అచీవర్స్ నాయకత్వ మార్పిడి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రోటరీ మాజీ గవర్నర్ తాళ్ల రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోనే ఎనభై మూడేళ్లుగా ప్రతియేటా కోట్ల రూపాయల ఖర్చుతో చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. రెండేళ్లుగా అధ్యక్ష బాధ్యతలు నిర్వహించిన పిడికిటి తిలక్ బాబు ప్రసంగిస్తూ రోటరీకి రెండేళ్ళు సేవాభావంతో పనిచేసినట్లు అన్నారు. నూతన అధ్యక్షుడు వల్లూరి సాంబశివరావు మాట్లాడుతూ తొలి ప్రాజెక్ట్‌గా నాలుగు లక్షల వ్యయంతో పెదపరిమిలో పేదల కోసం నిర్మిస్తున్న కళ్యాణమండపానికి ఫ్లోరింగ్ వేయించే బాధ్యత తీసుకుంటున్నట్లుగా తెలిపారు. నూతన కమిటీతో నూతన డైరెక్టర్లతో రోటరీ పూర్వ గవర్నర్ రాజశేఖర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన సభ్యులతో అసిస్టెంట్ గవర్నర్ కొల్లా శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమానికి క్లబ్ సెక్రటరీ కొండపనేని విజయ్‌కృష్ణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ గవర్నర్ పాటిబండ్ల శివరంజని, జిల్లా చైర్మన్ పీవీ సత్యనారాయణ, అసిస్టెంట్ గవర్నరు మద్దినేని సుధాకర్, కొల్లా శ్రీనివాస్‌తో పాటు క్లబ్ డైరెక్టర్లు, ఇతర రొటేరియన్ సభ్యులు పాల్గొన్నారు.

13న ఎన్టీఆర్ ప్రతిభా పురస్కారాల ప్రదానం

గుంటూరు(తూర్పు), జూలై 10 : కళాదర్బార్-అమరావతి ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈనెల 13న సాయంత్రం ఎన్టీఆర్ ప్రతిభా పురస్కారాల ప్రదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళాదర్బార్ వ్యవస్థాపక అధ్యక్షుడు పొత్తూరి రంగారావు తెలిపారు. అరండల్‌పేటలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ శత జయంతి వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని జరుపుతున్నట్లు వివరించారు. ఉత్సవాల్లో భాగంగా ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలిచిన ఎన్డీయే కూటమికి చెందిన ప్రజా ప్రతినిధులను ఘనంగా సత్కరిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నందమూరి రామకృష్ణ పాల్గొనున్నట్లు తెలిపారు. ఆత్మీయ అతిథులుగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్ధన్, బీజేపీ నాయకులు పాతూరి నాగభూషణం, టీడీపీ స్టేట్ ప్రోగ్రామ్ సెక్రటరీ మూలక సత్యవాణి హాజరవుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో భాగంగా సినీ సంగీత విభావరిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పంచుమర్తి కల్పన, పావని, బి చంద్రబాబు, బాబురావు, ధర్మ నారాయణసింగ్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ లేకపోతే శిక్షలే

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

గుంటూరు(లీగల్), జూలై 10: ద్విచక్ర వాహనదారులు చోదకులు కచ్చితంగా హెల్మెట్ ధరించి మాత్రమే వాహనం నడపాలని పిలియన్ రైడర్స్‌కు కూడా హెల్మెట్ ధారణ తప్పనిసరి అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి చెప్పారు. హెల్మెట్ ధరించటం ఆవశ్యకత వివరించేందుకు జిల్లా కోర్ట్ ప్రాంగణంలో మోటారు వాహనాల చట్టాలపై బుధవారం అవగాహనా సదస్సుతో పాటు నగరంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా జడ్జి పార్థసారథి మాట్లాడుతూ హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని ద్విచక్రవాహనం నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని సూచించారు. గుంటూరు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎస్‌కే కరీం మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వలన జరగబోయే ప్రమాదాలను అరికట్టవచ్చని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ గుంటూరు కార్యదర్శి టి.లీలావతి మాట్లాడుతూ ప్రతి ఒక్క రూ హెల్మెట్ ధరించాలని, కుటుంబసభ్యుల గురించి ఆలోచించి డ్రైవింగ్ జాగ్రత్తగా చేయాలన్నారు. ఒకటవ అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) జి.గోపాల కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తప్పకుండ హెల్మెట్ ధరించాలని తెలియచేసారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ పోలీసులు, ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం అధికారులతోపాటు న్యాయశాఖ ఉద్యోగులు, న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ అధికారులు వాహన చోదకులకు హెల్మెట్లు పంపిణీ చేశారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి తదితరులు

ఆగస్టు నుంచి కేన్సర్ స్క్రీనింగ్ శిబిరాలు

గుంటూరు (మెడికల్) జూలై 10: జిల్లావ్యాప్తంగా ఆగస్టు నుంచి ప్రజల్లో అవగాహన కోసం కేన్సర్ స్క్రీనింగ్ శిబిరాలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే.విజయలక్ష్మి తెలిపారు. గుంటూరు వైద్య కళాశాల ఎస్పీఎం గ్యాలరీ హాల్‌లో ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలకు, వైద్యాధికారులకు మూడురోజులుగా నిర్వహిస్తున్న సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ కేన్సర్ స్క్రీనింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ చివరి రోజున బుధవారం ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్‌కుమార్, ఎస్పీఎం విభాగాధిపతి డాక్టర్ సీతారాం, గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఆదిలక్ష్మి, ఎన్సీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ ఏ శ్రావణ్‌బాబు, డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడేతత్వాన్ని అలవర్చుకోవాలి

గుంటూరు(విద్య), జూలై 10 : విద్యార్థులు నిజ జీవితంలో కష్టనష్టాలను తెలుసుకుని ముందుకు సాగాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు శ్రీధర్‌బాబు అన్నారు. సంగడిగుంటలోని చలమయ్య డిగ్రీ కళాశాలలో భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. భారత్ వికాస్ పరిషత్ అధ్యక్షుడు చలమయ్య, కళాశాల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణప్రభు, ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, భారత్ వికాస్ పరిషత్ సెక్రటరీ రాజశేఖర్, ఫైనాన్స్ సెక్రటరీ కాళంగి శ్రీనివాసరావు, మల్లికార్జునరావు, శేఖర్, కళాశాల సభ్యులు కె.సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేటి నుంచి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల త్రో బాల్ పోటీలు

గుంటూరు(తూర్పు), జూలై 10 : గుంటూరు విద్యానగర్‌లోని స్టెమ్ పాఠశాల ఆధ్వర్యంలో గురువారం నుంచి రెండు రోజులు పాటు ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల పరిధిలోని సీబీఎస్‌సీఈ పాఠశాలల త్రో బాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ ఫాదర్ భరత్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 17, 19 బాలికల విభాగంలో ఈ పోటీలను జరుపుతున్నట్లు వివరించారు. ఈ పోటీలకు ఉమ్మడి రాష్ట్రాల నుంచి దాదాపు 600 మందికి పైగా క్రీడాకారులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు స్కూల్ ఆవరణలో మొదలయ్యే పోటీలను గుంటూరు పీఠాధిపతులు ఫాదర్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య ప్రారంభిస్తారని తెలిపారు.

ఉచిత ఇసుక పాలసీ నిర్మాణ కార్మికులకు వరం

● తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక పాలసీ నిర్మాణ కార్మికులకు వరమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరులోని 9వ డివిజన్లో భవన నిర్మాణ కార్మికులు ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో నసీర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కల నిజమయ్యేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జీవో నెంబర్ 43 విడుదల చేసి ఉచిత ఇసుక అందజేసి కష్టజీవుల అభ్యున్నతికి అవకాశం కల్పించారన్నారు. గతంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వమే ఇసుక మాఫియాను నడిపిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, జాగర్లమూడి శ్రీనివాస్, జనసేన నేతలు హరి, జడ సురేష్, అల్లం బాజీ, భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రులు దరిశాల శీను, ఆవుల అప్పారావు, బిక్షపతి, సూరయ్య, మాదాస్ సురేష్ పాల్గొన్నారు.



నిర్మాణ కార్మికులకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే నసీర్, గాదె వెంకటేశ్వర్లు

భారతీయుడు-2ను ప్రేక్షకులు ఆదరించాలి

గుంటూరు(తూర్పు), జూలై 10: సామాజిక అంశాలను స్పృశించే విధంగా రూపొందించిన భారతీయుడు-2 సినిమాను ఆదరించాలని తూర్పు ఎమ్మెల్యే నసీర్ కోరారు. ఈనెల 12వ తేదీన భారతీయుడు-2 విడుదల సందర్భంగా సురేష్ ఫిలింస్ ఆధ్వర్యంలో స్థానిక నాజ్ థియేటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కమలహాసన్, దర్శకుడు శంకర్ ఇద్దరూ సామాజిక బాధ్యత కలిగినవారేనని, అటువంటి కాంబినేషన్‌లో సినిమా రావడం అభినందనీయమని అన్నారు. సెన్సార్ బోర్డు మాజీ సభ్యుడు వెచ్చా కృష్ణమూర్తి, సురేష్ ఫిలింస్ మేనేజర్ మాదల రత్తయ్య చౌదరిలు మాట్లాడుతూ వినూత్న సందేశాత్మక చిత్రం భారతీయుడు-2 అని అన్నారు. అనంతరం ఈవీవీ యువ కళా వేదిక అధ్యక్షుడు వెచ్చా కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ప్రముఖ సినీనటి శోభారాణి, మాదల రత్తయ్యను ఎమ్మెల్యే నసీర్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కనకారావు, నాజ్ థియేటర్ అధినేత లియాఖత్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

కనీసం వేతనం అమలుకై ఐక్య పోరాటాలు చేయాలి

గుంటూరు(తూర్పు), జూలై 10 : కనీసం వేతనం ఇవ్వాలనే సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అమలుకై ఐక్య పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కే.సుబ్బరావమ్మ అన్నారు. జాతీయ కోర్కెల దినోత్స వం సందర్భంగా బుధవారం గుంటూరు కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ అనుబంధ సంఘాలు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు సీఐటీయూ పశ్చిమ కమిటీ అధ్యక్షుడు భగవతి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. కే.సుబ్బరావమ్మ మా ట్లాడుతూ సీఐటీయూ ఆల్ ఇండియా కమిటీ పిలుపులో భాగంగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ డీఆర్వో రోజాకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సీపీఐ నాయకులు నళినికాంత్, సీఐటీయూ నాయకులు కే.శ్రీనివాసరావు, బి.ముత్యాలరావు, రాజేంద్రప్రసాద్, పి.రాధ, ఎస్‌కే ఖాసింవలి, దీప్తి మనోజ, కే.చిన్న వెంకాయమ్మ, దీవెనరావు పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణ విద్యార్థినీ, విద్యార్థులకు ఉపకార వేతనాలు

గుంటూరు సిటీ, జూలై 10 : విద్య నభ్యసిస్తున్న పేద బ్రాహ్మణ విద్యార్థినీ, విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించనున్నట్లు బ్రాహ్మణ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు లక్ష్మీపతి వెల్లడించారు. బ్రాడీపేట 1/13లో ఉన్న బ్రాహ్మణ సేవా సమితి కార్యాలయంలో బుధవారం పేద బ్రాహ్మణ విద్యార్థినీ, విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేసేందుకు కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. కార్యదర్శి తుళ్లూరు ప్రకాష్ మాట్లాడుతూ కాలేజీలో చదువుతున్న ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్, సీఏ తదితర కోర్సులు చదువుతున్న వారికి ఆగస్టు 17వ తేదీ వరకు సమితి కార్యాలయంలో అప్లికేషన్లు అందజేస్తామని, 25న అప్లికేషన్లు పరిశీలన, సెప్టెంబరు ఒకటో తేదీన ఉపకార వేతనాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపకార వేతనాల చైర్మన్ జీవీఎల్ఎన్ సంజీవరావు, కోశాధికారి కర్లపాలెం బాలకృష్ణ, సభ్యులు నందిరాజు పాండు రంగారావు, ఎం.రామ్‌గోపాల్, ఏ.మంగాదేవి తదితరులు పాల్గొన్నారు. వివరాలకు ఉపకార వేతనాలు కమిటీ చైర్మన్ జి సంజీవ్‌రావు, సెల్ నెంబర్ 9441655888 ద్వారా సంప్రదించవచ్చని కార్యదర్శి తెలియజేశారు.

వైద్య విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన వైసీపీ ప్రభుత్వం

● మీడియా సమావేశంలో పలువురు విద్యావేత్తలు

గుంటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల ద్వారా వైద్య విద్యను వ్యాపారంగా మార్చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిందని డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు విమర్శించారు. బుధవారం స్థానిక బ్రాడీపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం 107, 108 జీవోల విడుదల చేసి కష్టపడి చదువుకునే మెరిట్ విద్యార్థుల జీవితాలను నాశనం చేసిందన్నారు. నూతన టీడీపీ ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించి వైద్య విద్యార్థులకు న్యాయం చేసేలా ఆ జీవోలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నవ్యాంధ్ర ఇంటలెక్చువల్ సభ్యుడు డీఏఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గతంలో వాయిదా పడి ప్రారంభం జరగని కొత్త మెడికల్ కాలేజీలను ఈ ఏడాది అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలన్నారు. 107, 108 జీవోలపై రాష్ట్ర హైకోర్టులో వాదనలు వినిపిస్తున్న న్యాయవాది ఠాగూర్ యాదవ్ మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీ సుప్రీంకోర్టులో వీటిపై మరొకసారి హియరింగ్ జరగబోతుందన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ టీసేవా కుమార్, డాక్టర్ చంద్రకుమార్, శేషు కుమార్, భాష్యం కాలేజీ ప్రిన్సిపాల్ హరిబాబు, డాక్టర్ నరసింహారావు పాల్గొన్నారు.

ఐదుగురు వైద్యులను కోల్పోవడం బాధాకరం

● నగర ఐఎంఏ నేతల నివాళులు

గుంటూరు (మెడికల్) జూలై 10 : ఇటీవల గుంటూరు నగరంలో కొద్ది కాల వ్యవధిలో ఐదుగురు ప్రముఖ వైద్యులను కోల్పోవడం బాధాకరమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) గుంటూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని ఐఎంఏ హాల్‌లో జరిగిన సంతాప సభలో ఇటీవల మృతి చెందిన డాక్టర్ మోటూరి సత్యనారాయణ, డాక్టర్ పీ.భగవన్నారా యణ, డాక్టర్ డీ.వెంకట్రామయ్య, డాక్టర్ వి.సంతోష్ కుమార్, డాక్టర్ పీ.నందుసింగ్ చిత్రపటాలకు ఐఎంఏ వైద్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐఎంఏ స్టేట్ ప్రెసిడెంట్ ఎలెక్ట్ జీ.నందకిషోర్, నగర కార్యదర్శి బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, ఉపాధ్యక్షుడు వెలగా మహేష్, సంయుక్త కార్యదర్శి బీ సాయికృష్ణ, బదిరి నారాయణ, పద్మావతిదేవి, శనక్కాయల అరుణ, రాయపాటి మమత, ఎం.పర్నీకుమార్, కే.సురేష్‌కుమార్, బీ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పెన్షనర్లకు ఒక్క క్లిక్‌తో ప్రభుత్వ శాఖల సేవలు సులభం

గుంటూరు, జూలై 10 : పెన్షనర్లకు ఒక్క క్లిక్‌తో ప్రభుత్వ శాఖల సేవలు సులభంగా అందుతాయని పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామాన్య పౌరులకు ప్రభుత్వ శాఖల సేవలు అందాలంటే ఒక యజ్ఞం చేసినట్టేనన్నారు. కొత్త వాహనానికి లైసెన్స్ రావాలన్నా, మున్సిపల్ పనులు, రెవెన్యూ కష్టాలు, రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, ఆఖరికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులను కలవాలన్నా సమస్యలేనన్నారు. అధికారుల చేతులు తడవందే పనులు కావని ఆరోపించారు. ఏ సమస్యకు ఏ అధికారిని కలిస్తే పనులు అవుతాయో తెలియని గందరగోళముంటుందన్నారు. ప్రభుత్వ విభాగాలన్నీ అంతర్జాలంలో వెబ్‌సైట్‌ను నిర్వహిస్తూ వినియోగదారులు ఫిర్యాదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నాయన్నారు. దక్షిణ ప్రాంత విద్యుత్ సంస్థ పరిధిలో విద్యుత్ శాఖ సిబ్బంది పౌరుల ఫిర్యాదులకు స్పందించకపోతే వినియోగదారులు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉందన్నారు.

ఎటువంటి సమస్యకైనా ఆయా వెబ్ సైట్స్‌లోకి వెళ్ళి సమస్యను తెలియజేయవచ్చన్నారు. ఆ సమస్యకు సంబంధించిన ఆధారాలను కూడా అప్‌లోడ్ చేసే అవకాశం ఉందన్నా రు. వివరాలు నమోదు చేసిన తరువాత ఓ ఐడీ నెంబరు వస్తుందని, దాని ద్వారా మన ఫిర్యాదు ఏ దశలో ఉందో తెలుస్తుందన్నారు. సమ యానికి సరుకులు అందకపోయినా, గ్యాస్ సరఫరాలో ఆలస్యమైనా అంతర్జాలంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఏపీసివిల్‌సప్లయిస్.జీవోవి. ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్ళి ఫిర్యాదుల డబ్బాపై క్లిక్ చేయాలన్నారు. అనం తరం బాధిత వ్యక్తికి సంబంధించిన వివరాలు చరవాణి సంఖ్య నమో దు చేయాలన్నారు. తరువాత ఫిర్యాదు చేసే విభాగంలోకి వెళ్ళి 250 పదాలతో సమస్యను రాయాలన్నారు. అప్పుడు ఐడీ నెంబరు వస్తుంద ని, ఆ ఐడి నెంబరుతో వివరాలు తెలుసుకోవచ్చని వీరయ్య తెలిపారు.

ఆర్‌ఎంపీ సమస్యలు పరిష్కరించాలి

● మంత్రి లోకేశ్‌కు సంఘం నేతల వినతి

గుంటూరు (మెడికల్) జూలై 10: ఆర్‌ఎంపీ, పీఎంపీ, గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంత్రి నారా లోకేశ్‌ను, తెలుగునాడు కమ్యూనిటీ పారా మెడిక్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు కలిశారు. ఆర్‌ఎంపీ వైద్యుల చట్టబద్ధతపై యువగళంలో ఇచ్చిన హామీని టీఎన్ సీపీఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.రవిచంద్ర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ రసూల్, కోశాధికారి పి వెంకటరావు తదితరులు లోకేశ్‌కు గుర్తు చేశారు. మంత్రి లోకేశ్ స్పందిస్తూ టీడీపీ ఇచ్చిన హామీని తన పేషీకి చెప్పి ఆరోగ్య శాఖకు పంపాలని వెంటనే ఆదేశాలు ఇచ్చినట్లు రవిచంద్ర తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో గ్రామీణ వైద్యుల క్లినిక్‌లపై దాడులు జరుగుతున్నాయని వారు మంత్రికి వివరించగా, అలాంటివి మన దగ్గర జరగవని లోకేశ్ అభయం ఇచ్చినట్లు టీఎన్‌సీపీఏ నేతలు హర్షం వ్యక్తం చేశారు.



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నేతలు

డయేరియాపై అవగాహన ర్యాలీ

గుంటూరు(తూర్పు), జూలై 10 : డయేరియాను అరికట్టాలంటూ గుంటూరు రూరల్ మండలం, వెంగళాయపాలెం గ్రామంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జలజీవన్ పీడీ కిరణ్‌కుమార్ పాల్గొని చేతుల శుభ్రత, డయేరియాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పరిసరాల శుభ్రత, డయేరియా వ్యాధుల నియంత్రణపై గ్రామస్థులకు ఆయన పలు సూచనలు చేశారు. వ్యాధుల చికిత్స విధానాలపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఎంపీడీవో ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లలిత కుమార్, జల జీవన్ మిషన్ జిల్లా కో ఆర్డినేటర్లు తేజ్ సంగీత్, షఫీ, పంచాయతీ కార్యదర్శి ఎం.ఆంజనేయ ప్రసాదు, స్థానిక సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో రోగులు, సహాయకుల కోసం షెడ్డు

గుంటూరు (మెడికల్) జూలై 10 : ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో ల్యాబ్ ఫలితాల కోసం ఎదురుచూసే రోగులు, వారి సహాయకుల కోసం రూ.10 లక్షలతో రేకుల షెడ్డు నిర్మిస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్‌కుమార్ వెల్లడించారు. బుధవారం పాత ఓపీ బ్లాక్ సమీపంలో చేపట్టిన షెడ్డు నిర్మాణానికి ఆయన భూమి పూజ నిర్వహించారు. ఇదిలాఉంటే ప్రభుత్వాస్పత్రి ప్రహరీ చుట్టూ అనుకొని సాగిస్తున్న అక్రమ వ్యాపారాలను నగర పాలక సంస్థ సిటీ ప్లానర్‌తో కలసి బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ పరిశీలించారు. ఇక్కడ నిర్వహించే వ్యాపారాల వల్ల వ్యర్థపదార్థాలు ఉత్పన్నమై ఎలుకలు ఆసుపత్రిలోకి వెళ్లేందుకు అవకాశం కలుగుతున్నట్లు వారు గుర్తించారు. ఈ విషయాన్ని కలెక్టర్, నగర కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని కిరణ్‌కుమార్ ప్రకటించారు.

ఏపీజీఎల్ఐ ఆన్‌లైన్ విధానంపై పునరాలోచించాలి

గుంటూరు(విద్య), జూలై 10 : గత ప్రభుత్వం ఏపీజీఎల్‌ఐలో మాన్యువల్ లోన్లు, క్లోజర్స్‌కు దరఖాస్తు చేసుకునే విధానం మార్చి ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల అనేక సమస్యలు వస్తున్నా యని డెమోక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె. జ్ఞానేశ్వరరావు, బి.కుమారరాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు విద్యాశాఖ అధికారులకు లేఖలు పంపారు. గత ప్రభుత్వం తొమ్మిది నెలల పాటు ఆన్‌లైన్ విధానం ప్రవేశ పెడుతున్నామనే కారణం చూపి లోన్లు, క్లోజర్స్‌కు దరఖాస్తు చేసుకోకుండా చేసిందని తెలిపారు. దీంతో ఒకేసారిగా జిల్లాకు 2,000 పైగా దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. మరోవైపు క్లోజర్స్ కోసం దరఖాస్తు చేసిన చాలా మందికి నూతన సాఫ్ట్‌వేర్‌పై అవగాహన లేకపోవడంతో తప్పులు దొర్లుతున్నాయన్నారు. నూతన ప్రభుత్వం ఏపీజీఎల్‌ఐలో ఆన్‌లైన్ విధానంపై పునరాలోచించాలని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదు వాహనాలు సీజ్

గుంటూరు, జూన్ 10 : స్థానిక పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కొల్లి శారద హోల్‌సేల్ మార్కెట్ వద్ద జరిగిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఐదు వాహనాలు పట్టుబడ్డాయి. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఐదుగురిని పోలీసులు గుర్తించారు. ఈ సందర్భంగా వారిపై కేసులు నమోదు చేసి ఆ వాహనాలను సీజ్ చేశారు.

వృద్ధుడిపై దాడి

స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని వికాస్ నగర్‌లో మెయింటినెన్స్ చెల్లించాలని అడిగిన అసోసియేషన్ సెక్రటరీపై దాడి చేశారు. వివరాలలోకి వెళితే... వికాస్‌నగర్‌లోని ఓం సాయి సన్నిధి అపార్టుమెంట్లో కొద్ది నెలలుగా బత్తినేని వరుణ్, వనజ దంపతులు మెయింటినెన్స్ చెల్లించడం లేదు. దీంతో అసోసియేషన్ సెక్రటరీ యోగేశ్వరరావు అడిగారు. దీంతో భార్యాభర్తలు ఇరువురు ఆయనపై దాడి చేసి కొట్టారు. దీనిపై పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెలవు.. విధుల్లోకి.. అంతలోనే వీఆర్

● నల్లపాడు సీఐ పోస్టింగ్ వ్యవహారం వివాదాస్పదం

గుంటూరు, జూలై 10: తుళ్లూరు సీఐ మాతంగి శ్రీనివాసరావు వ్యవహారం మరువక మునుపే జిల్లా పోలీస్ శాఖలో మరో వివాదం చోటుచేసుకుంది. ఇటీవల సెలవుపై వెళ్లిన నల్లపాడు సీఐ నరేష్ కుమార్ బుధవారం తిరిగి విధుల్లో చేరడం.. టీడీపీ శ్రేణుల ఆగ్రహంతో గంటల వ్యవధిలోనే ఆయనను వీఆర్‌కు పంపారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. ఇటీవల నల్లపాడు స్టేషన్ పరిధిలోని బుడంపాడులో సీఐ నరేష్‌కుమార్ సివిల్ వివాదంలో జోక్యం చేసుకుని బాధితులతో అనుచితంగా వ్యవహరించారనే ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై టీడీపీ నాయకులు పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ వ్యవహారం వివాదాస్పదం కాకుండా చూసేందుకు ఓ ఉన్నతాధికారి సీఐను శనివారం సెలవులోకి పంపినట్లు తెలిసింది. ఆ స్థానంలో సీఐగా వెంకన్నచౌదరిని అటాచ్ చేశారు. తనకిష్టం లేదని వెంకన్నచౌదరి చెప్పినా త్వరలో కొత్త సీఐని నియమిస్తామని, అప్పటి వరకు తాత్కాలికంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ క్రమంలో ఆయన ఆదివారం విధుల్లో చేరారు. అయితే వెంకన్న చౌదరి అక్కడ వీధుల్లో చేరడం ఓ ఉన్నతాధికారికి ఇష్టం లేదని తెలిసింది. దీనితో ఆయన మళ్లీ చక్రం తిప్పి సెలవుపై పంపిన నరేష్‌కుమార్‌ను వెనక్కు పిలిపించారు. వాస్తవానికి బుధవారం వరకు నరేష్‌కుమార్ శెలవు ఉంది. అయినా ఉన్నతాధికారి ఆదేశాలతో ఒకరోజు ముందే నరేష్‌కుమార్ తిరిగి విధుల్లో చేరారు. తాను వ్యక్తిగత సెలవు నుంచి వెనక్కి వచ్చానని చెప్పి నరేష్‌కుమార్ విధుల్లో చేరారు. సీఐ నరేష్‌కుమార్ విధుల్లో చేరడంతో వెంకన్నచౌదరి రిలీవ్ అయ్యారు. తాను తిరిగి విధుల్లో చేరినట్లుగా నరేష్ కుమార్ ఫొటో తీసి సోషల్ మీడియాలో విడుదల చేశారు. ఈ ఫొటో వ్యవహారం టీడీపీ శ్రేణులకు మరింత ఆగ్రహాన్ని కలిగించింది. పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులుని, జిల్లాలోని పలువురు నేతలను ఆశ్రయించి సెలవులో వెళ్లిన సీఐ నరేష్ కుమార్ తిరిగి విధుల్లో చేరడం, అక్కడ విధులు నిర్వహిస్తున్న వెంకన్న చౌదరిని రిలీవ్ చేయడం వంటి అంశాలపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ నేతలు స్పందించి ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో తిరిగి బుధవారం రాత్రి ఆయనను వీఆర్‌కు పంపుతూ ఆదేశాలు జారీ చేశారు. మొత్తం మీద జిల్లా పోలీస్ శాఖలో చోటుచేసుకుంటున్న పరిణామాలు పార్టీ శ్రేణులనే కాక పోలీస్ వర్గాలను కూడా విస్మయానికి గురి చేస్తున్నాయి. రేంజ్ పరిధిలోని ఓ పోలీసు ఉన్నతాధికారి పోస్టింగ్స్ విషయంలో చక్రం తిప్పుతున్నారని, తమ చేతుల్లో కూడా ఏమీ లేదని పలువురు నేతలు వ్యాఖ్యానించడంతో కార్యకర్తలు విస్మయానికి గురయ్యారు.



ఎదురెదురుగా ఇద్దరు సీఐలు

జగన్ మరోసారి జైలుకెళ్లక తప్పదు

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కనపర్తి



గుంటూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన ఇసుక, మద్యం మైనింగ్ పాలసీలపై విచారణ జరిపితే వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి శాశ్వతంగా జైలుకెళ్లక తప్పదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న అన్నీ ఇసుక రీచ్‌లను గంపగుత్తగా ఒకే సంస్థకు కట్టబెట్టి వేల కోట్ల అవినీతికి పాల్పడ్డ జగన్మోహనరెడ్డిని, ఆయనకు అండ దండలందించిన ఉన్నతాధికారుల పైన విచారణ జరిపి వాస్తవాలను ప్రజలముందుంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని కనపర్తి అన్నారు. చంద్రబాబు ప్రవేశ పెట్టిన ఉచిత ఇసుక పథకంపై మాట్లాడే అర్హత అంబోతు రాంబాబుకు లేదన్నారు. తన కేసుల కోసం విభజన హామీలను ఢిల్లీ పెద్దల వద్ద తాకట్టుపెట్టిన జగన్, అధికారం పోగానే ప్రత్యేక హోదా గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. జగన్ నూతన ఇసుక విధానం పేరుతో 60 మంది భవన నిర్మాణ కార్మికులను పొట్టన బెట్టుకున్నాడని, ఎన్నికల సమయంలో పెన్షన్ల పేరుతో మరో 40 మంది వృద్ధులను తన స్వార్థానికి బలితీసుకున్నాడని కనపర్తి ఆరోపించారు. ప్రజల జీవనాడైన పోలవరాన్ని 20 సంవత్సరాలు వెనక్కు తీసుకెళ్లిన చరిత్ర హీనుడు జగన్ అని ఆయన విమర్శించారు.

రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ అమరావతి శాఖలో లోక్ అదాలత్

గుంటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట ఒకటో లైనులోని రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ అమరావతి శాఖలో నాలుగు రోజుల లోక్ అదాలత్ ప్రారంభమైంది. బుధవారం రెండో రోజున ట్రిబ్యునల్ సభ్యుడు(టెక్నికల్) జీ.జాన్ ప్రసాద్, మరో సభ్యురాలు సత్యభామ ఆధ్వర్యంలో పలు కేసులను పరిష్కరించారు. ఈ నెల 9వ తేదీన ప్రారంభమైన లోక్ అదాలత్ 12వ తేదీ వరకు కొనసాగుతుందని వారు చెప్పారు. రైల్వే సంబంధిత క్లెయిమ్‌లు, వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడమే ఈ అదాలత్ ముఖ్య లక్ష్యమన్నారు. ఈ అదాలత్‌ని చీఫ్ క్లెయిమ్స్ రవిప్రసాద్ పాడి, అదనపు రిజిస్ట్రార్ రాజేంద్రప్రసాద్ పర్యవేక్షించారు.

అలరించిన భక్తి సంగీత విభావరి

గుంటూరు(తూర్పు), జూన్ 10 : స్థానిక సంపత్‌నగర్‌లో స్వరరాగ సుధా గుంటూరు 24వ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. స్వరరాగ సుధా వ్యవస్థాపకులు సాయిబాబా శర్మ, విశ్రాంత ఉపాధ్యాయిని పద్మావతిని ఘనంగా సత్కరించి, నగదు పురస్కారం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సంగీత విభావరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. సాయిబాబా శర్మ, ఆర్పీఎల్ నరసింహారావు పలు గీతాలను ఆలపించారు.

దిక్సూచి DIKSUCHI

డా.వైఎస్సార్‌హెచ్‌యూ కళాశాలల్లో బీఎస్సీ(ఆనర్స్) హార్టికల్చర్



పశ్చిమ గోదావరి జిల్లా, వెంకటరామన్న గూడెంలోని డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ (డావైఎస్సార్‌హెచ్‌యూ)-'బీఎస్సీ ఆనర్స్ హార్టికల్చర్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. వర్సిటీ కళాశాలలు సహా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలు అనుబంధ కళాశాలలు ఈ ప్రోగ్రామ్‌ని అందిస్తున్నాయి. బైపీసీ స్ట్రీమ్, ఎన్ఆర్ఐ అండ్ ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్, ఇండస్ట్రియల్ స్పాన్సర్‌షిప్ కోటాల కింద అడ్మిషన్స్ నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

బైపీసీ స్ట్రీమ్

ఈ స్ట్రీం కింద మొత్తం 541 సీట్లు ఉన్నాయి. వీటిలో 13 'పేమెంట్' సీట్లు; 168 'కేటగిరీ ఎ' సీట్లు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థుల కోసం 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. ఏపీ ఈఏపీసెట్ 2024 ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. కాలేజ్ ఆఫ్ హార్టికల్చర్(వెంకటరామన్నగూడెం, అనంతరాజుపేట, పార్వతీపురం, చిన్నలతరపీ, పులివెందుల) క్యాంపస్‌లు; అనంతపురంలోని శ్రీకృష్ణ దేవరాయ కాలేజ్ ఆఫ్ హార్టికల్చరల్ సైన్సెస్, జేసీ దివాకర్ రెడ్డి హార్టికల్చరల్ కాలేజ్; ప్రకాశం జిల్లాలోని కదిరి బాబూరావు కాలేజ్ ఫర్ హార్టికల్చర్, ఎన్ఎస్ కాలేజ్ ఆఫ్ హార్టికల్చరల్ సైన్సెస్‌లలో అడ్మిషన్స్ పొందవచ్చు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/నేచురల్ సైన్సెస్ సబ్జెక్టులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఏపీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ తప్పనిసరి. 2024 డిసెంబరు 31 నాటికి జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా

దీని కింద 15 శాతం సూపర్‌న్యూమరరీ సీట్లు ప్రత్యేకించారు. మొత్తం 56 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏపీ ఈఏపీసెట్ ర్యాంక్‌తో పనిలేదు. అకడమిక్ మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. రిజర్వేషన్‌లు వర్తించవు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ స్ట్రీమ్(బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులు) లేదా ఎంబైపీసీ స్ట్రీమ్(మేథమెటిక్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులు)తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. అభ్యర్థులు పదోతరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకూ ఆంగ్ల మాధ్యమంలో చదివి ఉండాలి. లేని పక్షంలో ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ టెస్ట్(ఐఈఎల్‌టీఎస్/టోఫెల్) స్కోర్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- అభ్యర్థులు పూర్తిచేసిన దరఖాస్తుతో పాటు సంబంధిత ఎన్ఆర్ఐ వీసా-పాస్‌పోర్ట్-ఆదాయం ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కేటగిరీకి విద్యార్థి తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.

ఇండస్ట్రియల్ స్పాన్సర్‌షిప్ కోటా

దీని కింద 2 శాతం సీట్లు ప్రత్యేకించారు. మొత్తం 8 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ/ఎంబైపీసీ స్ట్రీమ్‌తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- అభ్యర్థులు పూర్తిచేసిన దరఖాస్తుతోపాటు స్పాన్సర్ సంస్థకు సంబంధించిన సేల్స్ ట్యాక్స్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, పాన్ కార్డ్, గత మూడేళ్ల ఆడిటెడ్ బ్యాలెన్స్ షీట్, ఇన్‌కం ట్యాక్స్ రిటర్న్ స్టేట్‌మెంట్, ఇన్‌కార్పొరేషన్ సర్టిఫికెట్, అసోసియేషన్ మెమొరాండమ్, స్పాన్సర్‌షిప్ లెటర్ జతచేసి కింది చిరునామాకు పంపాలి.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 9
- **వెబ్‌సైట్:** https://drysrhu.ap.gov.in

వసంత్‌దాదా షుగర్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రోగ్రామ్‌లు

పుణెలోని వసంత్‌దాదా షుగర్ ఇన్‌స్టిట్యూట్(వీఎస్ఐ)-పీజీ, పీజీ డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్‌నకు నిర్దేశించిన మేరకు ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ఎమ్మెస్సీ

- ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, వైన్-బ్రూవింగ్-ఆల్కహాల్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 24 సీట్లు ఉన్నాయి.
- ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ కోర్సుకు బీఎస్సీ(జనరల్/అగ్రికల్చర్/ఫిషరీస్/నానోసైన్స్ అండ్ నానో టెక్నాలజీ)/బీఫార్మసీ/బీఈ/బీటెక్/బీఎస్సీ(బ్లెండెడ్)పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కోర్సుకు నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో జనరల్ కెమిస్ట్రీ నుంచి 30 మార్కులకు, బయలాజికల్ సైన్సెస్ నుంచి 30 మార్కులకు, జనరల్ ఇంగ్లీష్ నుంచి 10 మార్కులకు, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ నుంచి 30 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.
- వైన్-బ్రూవింగ్-ఆల్కహాల్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌కు బీఎస్సీ(వైన్ టెక్నాలజీ/బయోటెక్నాలజీ/మైక్రో బయాలజీ/కెమిస్ట్రీ/అగ్రికల్చర్/బోటనీ/జువాలజీ/అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ/హార్టికల్చర్); పీజీడీఐఎఫ్ఏటీ/బీటెక్(కెమికల్/బయోటెక్నాలజీ) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. ఈ కోర్సుకు నిర్వహించే ఎంట్రెన్స్‌లో జనరల్ కెమిస్ట్రీ నుంచి 40 మార్కులకు, బయలాజికల్ సైన్సెస్ నుంచి 40 మార్కులకు, జనరల్ ఇంగ్లీష్ నుంచి 20 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.

పీజీ డిప్లొమా

- **షుగర్ టెక్నాలజీ(ఎస్‌టీ):** ప్రోగ్రామ్ వ్యవధి రెండున్నరేళ్లు. ఇందులో ప్రవేశానికి బీఎస్సీ(షుగర్ టెక్నాలజీ, స్టాటిస్టిక్స్/ఎంపీసీ)/బీటెక్(కెమికల్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో 50 సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో జనరల్ కెమిస్ట్రీ నుంచి 50 మార్కులకు, మేథమెటిక్స్ నుంచి 30 మార్కులకు, జనరల్ ఇంగ్లీష్ నుంచి 20 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.
- **ఇండస్ట్రియల్ ఫర్మెంటేషన్ అండ్ ఆల్కహాల్ టెక్నాలజీ(ఐఎఫ్ఏటీ):** ప్రోగ్రామ్ వ్యవధి 22 నెలలు. ఈ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి కెమిస్ట్రీ, వైన్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ, మైక్రో బయాలజీ, ఆల్కహాల్ టెక్నాలజీ సబ్జెక్టులలో ఒకటి ప్రధాన సబ్జెక్ట్‌గా బీఎస్సీ పూర్తిచేసినవారు; బీటెక్(బయోటెక్నాలజీ/కెమికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో 120 సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో జనరల్ కెమిస్ట్రీ నుంచి 40 మార్కులకు, బయలాజికల్ సైన్సెస్ నుంచి 40 మార్కులకు, జనరల్ ఇంగ్లీష్ నుంచి 20 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు.



- **షుగర్ ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ(ఎస్ఐటీ):** ప్రోగ్రామ్ వ్యవధి 18 నెలలు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్, ఎలక్ట్రానిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా బీఎస్సీ ఉత్తీర్ణులు; బీటెక్(ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు ఉన్నాయి.
- షుగర్ ఇంజనీరింగ్ డిప్లొమా(ఎస్ఈడీ): ప్రోగ్రామ్ వ్యవధి 18 నెలలు. ఇందులో ప్రవేశానికి బీటెక్(మెకానికల్/ఎలక్ట్రికల్/కెమికల్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు ఉన్నాయి.

పీజీ సర్టిఫికెట్

- **షుగర్ ఇంజనీరింగ్ సర్టిఫికెట్(ఎస్ఈసీ):** ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. డిప్లొమా (మెకానికల్/ఎలక్ట్రికల్/కెమికల్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. షుగర్‌మిల్లులో కనీసం ఏడాది అనుభవం ఉండాలి. ఇందులో 15 సీట్లు ఉన్నాయి.
- **షుగర్ మాన్యుఫాక్చరింగ్ సర్టిఫికెట్(ఎస్ఎంసీ):** ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. బీఎస్సీ(కెమిస్ట్రీ/షుగర్ టెక్నాలజీ)/డిప్లొమా(షుగర్ టెక్నాలజీ/షుగర్ మాన్యుఫాక్చర్/కెమికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. సంబంధిత విభాగంలో కనీసం రెండేళ్ల అనుభవం తప్పనిసరి. ఇందులో 35 సీట్లు ఉన్నాయి.

సర్టిఫికెట్

- **షుగర్ బాయిలింగ్ సర్టిఫికెట్(ఎస్‌బీసీ):** ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు షుగర్‌పరిశ్రమలో కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు లేదా ఇంటర్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో 60 సీట్లు ఉన్నాయి.
- **జ్యూస్ సూపర్విజన్ సర్టిఫికెట్(జేఎస్‌సీ):** ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు షుగర్‌పరిశ్రమలో కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో 30 సీట్లు ఉన్నాయి.
- **ఈటీపీ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సర్టిఫికెట్(ఈటీపీఓఎం):** ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతో పాటు షుగర్‌పరిశ్రమలో కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో 30 సీట్లు ఉన్నాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 15
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీలు:** ఎమ్మెస్సీ కోర్సులకు జూలై 23న; పీజీ డిప్లొమా(ఐఎఫ్ఏటీ)కి జూలై 24న
- **ఇంటర్వ్యూలు:** జూలై 23 - 25
- **వెబ్‌సైట్:** www.vsisugar.com

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/jVHfrSTలో చదవండి.



కశ్మీర్‌లో సాంగ్ వేసుకున్న బచ్చన్

హరీశ్ శంకర్ దర్శకత్వంలో రవితేజ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటిస్తున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్‌తో సునాహోగా' ట్యాగ్ లైన్. జగపతిబాబు, సచిన్ ఖేడేకర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తి చేసుకుంది. తాజాగా, ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ 'సితార' పాటను మేకర్స్ విడుదల చేశారు. కశ్మీర్‌లోని అందమైన లొకేషన్స్‌లో సాగిన ఈ డ్యూయెట్ పాటలోని విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. సాహితీ లిరిక్స్ అందించగా, సాకేత్ కొమండూరి, సమీర భరద్వాజ్ ఆలపించారు. మిక్కీ.జే.మేయర్ సంగీతం అందించగా శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. ఈ సినిమాకు ఎడిటర్: ఉజ్వల్‌కులకర్ణి, డీఓపీ:ఆయనంక బోస్.

తిన్నడి విల్లు కథ



మంచు విష్ణు నటిస్తున్న 'కన్నప్ప' చిత్రం మీద 'టీజర్' అంచనాలను మరింత పెంచేసింది. తాజాగా ఈ సినిమాలో విష్ణు వాడిన విల్లుకు ఓ విశిష్టత ఉంది. అదేమిటో విష్ణు వివరిస్తూ 'తిన్నడు వాడిన విల్లు కేవలం ఆయుధం మాత్రమే కాదు.. తండ్రీకొడుకుల అనుబంధానికి ప్రతీక. కన్నప్ప తండ్రి నాదనాథ స్వయంగా తయారు చేసిన ఈ విల్లు కుటుంబ వారసత్వంగా నిలిచింది. కళాదర్శకుడు క్రిష్ ప్రత్యేకంగా ఈ విల్లు తయారు చేశాడు. కన్నప్ప దాన్ని అచంచలమైన బలంతో ఉపయోగిస్తూ తన తెగను, అడవిలో సమతుల్యతను కాపాడుకుంటాడు. యువతకు స్ఫూర్తినిచ్చే కథ ఇది' అన్నారు.

ట్రోలర్స్‌కు మంచు విష్ణు హెచ్చరిక

సినీతారల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా, వారి గౌరవానికి భంగం కలిగించేలా పోస్ట్ చేసిన వీడియోలు, మీమ్స్‌ను 48 గంటల్లో తొలగించాలని డిజిటల్ కంటెంట్ క్రియేటర్స్‌కు నటుడు, మా (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) అధ్యక్షుడు మంచు విష్ణు బుధవారం విజ్ఞప్తి చేశారు. ట్రోలింగ్ వీడియోలను వెంటనే తొలగించని పక్షంలో తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

రాజ్‌తరుణ్ గర్ల్‌ఫ్రెండ్ బెదిరిస్తోంది

● పోలీసులకు నటి మాల్వి ఫిర్యాదు ● నార్సింగ్ ఠాణాకు మరోసారి లావణ్య



నటుడు రాజ్‌తరుణ్ గర్ల్‌ఫ్రెండ్ లావణ్య తనకు, తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి.. బెదిరిస్తున్నారని, వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ.. నటి మాల్వి మల్హోత్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన మాల్వి కుటుంబం ముంబైలో ఉంటోంది. రాజ్‌తరుణ్ చిత్రం 'తిరగబడరా స్వామి' చిత్రంలో మాల్వి కథానాయికగా నటించారు. సినిమా ప్రమోషన్ నిమిత్తం ఆమె టోలిచౌకిలో ఉంటున్నారు. రాజ్‌తరుణ్‌తో వివాదం నేపథ్యంలో లావణ్య పదేపదే తన పేరును ప్రస్తావిస్తున్నారని.. తనకు, తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ మాల్వి ఫిల్మ్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన పరువుప్రతిష్ఠలకు భంగం కలిగేలా వ్యవహరిస్తున్న లావణ్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో కోరారు. అయితే.. మాల్వి ఉంటున్నది తమ పరిధి కాకపోవడంతో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు కేసును రాయదుర్గం ఠాణాకు బదిలీ చేశారు. కాగా.. లావణ్య బుధవారం మరోమారు రాజ్‌తరుణ్‌పై నార్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 4న ఆమె తొలిసారి ఫిర్యాదు చేయగా.. పోలీసులు తగిన ఆధారాలను సమర్పించాలని కోరారు. దాంతో బుధవారం మరోమారు ఠాణాకు వచ్చిన లావణ్య.. పలు ఆధారాలను సమర్పించారు. వీటిల్లో 170 ఫొటోలు, సాంకేతిక ఆధారాలు, తనకు అబార్షన్ చేయించిన ఆస్పత్రి రికార్డులు ఉన్నాయి. దీంతోపాటు.. అన్విక పేరుతో తాను, రాజ్‌తరుణ్ విదేశాలకు వెళ్లిన ఆధారాలను సమర్పించారు. "పదేళ్లుగా నాతో కాపురం చేసిన రాజ్‌తరుణ్ ఇప్పుడు వదిలేస్తున్నాడు. చాలా సార్లు నా వాయిస్ కాల్స్‌ను రికార్డ్ చేశాడు. అది చట్టవిరుద్ధం. దానిపైనా చర్యలు తీసుకోండి. ఇప్పుడు రాజ్‌తరుణ్ మాల్వితో కలిసి విదేశాలకు పారిపోయేందుకు ప్రయత్నిస్తున్నాడు. వెంటనే చర్యలు తీసుకోండి" అని ఆ ఫిర్యాదులో పోలీసులను కోరారు. తనను పెళ్లి చేసుకుని, మరొకరితో తిరుగుతూ మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు నార్సింగ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

- బంజారాహిల్స్, నార్సింగ్ (ఆంధ్రజ్యోతి)


ట్రైలర్ ప్రామిసింగ్‌గా ఉంది

విష్వక్ సేన్



'పలాస 1978' ఫేమ్ రక్షిత్ అట్లూరి, సంగీర్తన విపిన్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఆపరేషన్ రావణ్'. ఈ న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌కు వెంకట సత్య దర్శకత్వం వహిస్తుండగా, ధ్యాన్ అట్లూరి నిర్మిస్తున్నారు. ఆగస్టు 2న సినిమా విడుదలవుతోంది. ఇప్పటికే రిలీజైన టీజర్ అందరినీ ఆకట్టుకుంది. బుధవారం సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన విష్వక్ సేన్ మాట్లాడుతూ "ట్రైలర్ ప్రామిసింగ్‌గా ఉంది. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా" అని చెప్పారు. "సినిమాలోని ప్రతీ పాత్రకూ విశిష్టత ఉంటుంది. సినిమా అందరి అంచనాలకు మించి ఉంటుంది" అని రక్షిత్ అట్లూరి చెప్పారు. "ఇప్పటివరకూ ఏ సినిమాలోనూ చూడని అంశాలు 'ఆపరేషన్ రావణ్'లో ఉంటాయి" అని దర్శకుడు వెంకట సత్య అన్నారు.

ప్రేక్షకులను రప్పించడం ముఖ్యం



సినిమా టికెట్ రేట్లు పెంచడం కంటే ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడమే ముఖ్యమని నిర్మాత డి.సురేశ్‌బాబు అభిప్రాయపడ్డారు. సంగీత దర్శకుడు తమన్, దర్శకుడు గోపిచంద్ మలినేనితో కలసి బుధవారం ఉదయం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం సురేశ్‌బాబు ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. చాలామంది ప్రేక్షకులు థియేటర్లకు రావడం లేదన్నారు. వారిని థియేటర్లకు తీసుకువస్తే సినిమా పరిశ్రమ బాగుంటుందని, ఎంతో మందికి ఉపాధి లభిస్తుందన్నారు.టికెట్ ధరల విషయంలో ఇప్పటికే ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో చర్చించగా సానుకూల స్పందన లభించిందన్నారు. ధరల విషయంలో ఏది కావాలంటే అది చేసుకోమనే వెలుసుబాటు ఇచ్చారని తెలిపారు

తిరుమల (ఆంధ్రజ్యోతి)

డ్రగ్స్‌కి దూరంగా ఉండండి



"ఫెయిల్యూర్ అనేది ఎంత ప్రమాదకరమో ఈ సినిమాలో దర్శకుడు చూపించాడు. ఈ చిత్రంలో నా ముగ్గురు పుత్రులకీ ఒక్కో సమస్య ఉంటుంది. ఇందులో కాలేజ్ లెక్చరర్ పాత్రలో నటించాను. ఈ సోషల్ మీడియా యుగంలో తల్లిదండ్రులు, పిల్లల మధ్య రిలేషన్ సరిగ్గా ఉండటం లేదు. ఇలాంటి టైమ్‌లో పిల్లలు చెడు బాట పట్టొచ్చు. పిల్లలకు తల్లిదండ్రులు మోరల్ సపోర్ట్ ఇస్తే కచ్చితంగా విజయం సాధిస్తారు. తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్ మీద పోరాటం చేస్తోంది. దయచేసి అందరూ డ్రగ్స్‌కి దూరంగా ఉండండి" అని నటుడు రాజా రవీంద్ర అన్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'సారంగదరియా'. పద్మారావు అబ్బిశెట్టి దర్శకత్వంలో ఉమాదేవి, శరత్‌చంద్ర చల్లపల్లి నిర్మించిన ఈ చిత్రం 12న విడుదలవుతోంది. బుధవారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో నవీన్‌చంద్ర మాట్లాడుతూ "ఈ సినిమా ప్రతీ ఇంట్లో జరిగే కథలా రిలేటబుల్‌గా ఉంది" అని అన్నారు.

షూటింగ్‌లో గాయపడ్డ ఊర్వశీ రౌతేలా?



బాబీ దర్శకత్వంలో నందమూరి బాలకృష్ణ హీరోగా నటిస్తున్న (ఎన్‌బీకే 109- వర్కింగ్ టైటిల్) చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఇందులో కథానాయికగా నటిస్తున్న ఊర్వశీ రౌతేలా మంగళవారం షూటింగ్‌లో గాయపడ్డారని సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. యాక్షన్ సీక్వెన్స్ చేస్తుండగా ఆమె కాలికి తీవ్రంగా గాయాలయ్యాయని, వెంటనే ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారని ప్రచారం జరిగింది. దీనిపై ఊర్వశి, ఆ చిత్రబృందం ఇప్పటివరకూ అధికారికంగా స్పందించలేదు. ఈ వార్తల నేపథ్యంలో బుధవారం ఊర్వశి సోషల్ మీడియా వేదికగా స్పందించారు. చికిత్స తీసుకుంటున్న వీడియోను షేర్ చేశారు. త్వరలోనే కోలుకొని సెట్స్‌కు తిరిగొస్తానని చెబుతూ విజయ సంకేతం చూపారు.

హీరోగా అద్దంకి దయాకర్



కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ సినీరంగ ప్రవేశం చేశారు.. బొమ్మక్ మురళి దర్శకత్వంలో రూపొందిన 'ఇండియా ఫైల్స్' చిత్రంలో ఆయన హీరోగా నటించారు. ఐదు భాషల్లో తయారవుతున్న ఈ సినిమాకు ఎంఎంకీరవాణి సంగీత దర్శకుడు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ దశలో ఉన్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఇంద్రజ, బీఆర్ఎస్ నాయకుడు దాసోజు శ్రవణ్ సహా మరికొందరు రాజకీయ నాయకులు ఇందులో నటించినట్లు తెలుస్తోంది. రాజకీయంగా అవకాశాలు వచ్చినట్టే వచ్చి చేజారిపోతున్న తరుణంలో ఈ సినిమా సక్సెస్ అయితే ఆయన సినిమాల వైపు వెళతారా, లేక రాజకీయాల్లోనే కొనసాగుతారా అన్నది వేచిచూడాలి.

మోత్కూరు (ఆంధ్రజ్యోతి)

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/mlTke5z లో చదవండి.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



మంత్రి డోలా వీరాంజనేయస్వామికి వినతి పత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

మంత్రులకు సచివాలయ ఉద్యోగుల వినతి

తెనాలి అర్బన్, జూలై 10 : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఆయా శాఖల మంత్రులను కలిసి వినతి పత్రాలు అందజేసినట్లు సచివాలయ సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శేషు తెలిపారు. విజయవాడలో విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్‌ను, సచివాలయ శాఖా మంత్రి డోలా వీరాంజనేయస్వామిలను కలిసి తమ సమస్యలను వివరించాని తెలిపారు. సచివాలయ ఉద్యోగులందరికి ఉద్యోగోన్నతులు కల్పించాలని, రూ.29 వేలు వేతనం, గ్రీన్ ఛానల్ ఏర్పాటు, టీఏ, డీఏలు, నోడల్ వ్యవస్థ, జాబ్‌చార్ట్‌లు అమలు చేయాలని కోరినట్లు తెలిపారు. అలాగే ప్రతి ఉద్యోగికి నోషనల్ ఇంక్రిమెంట్లతో పాటు బకాయిలను చెల్లించాలని, మహిళా ఉద్యోగులకు అలవెన్సులు, క్లస్టర్ వ్యవస్థ రద్దు, మహిళా పోలీసులకు జూనియర్ అసిస్టెంట్ స్థాయి కల్పించాలని, కార్యదర్శుల పని గంటలు మార్పు చేయాలని తాము కోరామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘ అధ్యక్షుడు జోసఫ్ కిషోర్, ఉపాధ్యక్షుడు కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ శేషన్న తదితరులు

డ్రెయిన్‌లలో చెత్త వేయరాదు

తెనాలి, మారీసుపేట జూలై 10: పట్టణ ప్రజలు డ్రెయిన్‌లు, మురుగు కాలువలలో చెత్తను వేయరాదని మున్సిపల్ కమీషనర్ బీ. శేషన్న అన్నారు. స్థానిక నందులపేటలోని 6వ వార్డులో బుధవారం ఆయన పారిశుధ్య పనులను పర్యవేక్షించి శానిటేషన్ సిబ్బందికి పలు సూచనలను చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డులోని ప్రజలు తడిచెత్త, పొడిచెత్త విధానాన్ని అనుసరించాలని మున్సిపల్ కార్మికులకు చెత్తను అందించాలని కోరారు. మురుగు కాల్వలలో వ్యర్థాలను వేయరాదని, దానివల్ల సిల్ట్ పేరుకొని మురుగు పారుదల ఆగిపోతుందని, దోమలకు ఆవాసాలుగా మారుతాయని అన్నారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కొర్రపాటి లక్ష్మీశ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ అధికారులు, శానిటేషన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చైల్డ్ వెల్ఫేర్ హోమ్‌కు చిన్నారి..

తెనాలి, మారీసుపేట జూలై 10: చిన్నారి షేక్ దక్షిత శ్రీవల్లిని సంరక్షణ కోసం చైల్డ్ వెల్ఫేర్ హోమ్, గుంటూరుకు తరలించినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. బుధవారం త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరముల ప్రకారం స్థానిక రావి రవీంద్రనాథ్ చెందిన షేక్ దక్షిత శ్రీవలి(7)ను చేతులు, కాళ్లపై తన తల్లి కొట్టిందని బాలిక అంగన్‌వాడీ కార్యకర్తలు కనకదుర్గ, హసీనాలుకు తెలపగా, వారు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. తల్లి కనకదుర్గ అనారోగ్య సమస్యలతో హైదరాబాదులో చికిత్స పొందుతుందని, తండ్రి బషీరున్ కేరళలో ఉన్నాడన్నారు. చిన్నారి సంరక్షణ కోసం చైల్డ్ వెల్ఫేర్ హోమ్ గుంటూరుకు తరలించి అధికారులకు అప్పగించనట్లు పోలీసులు తెలిపారు



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

కార్మికులకు న్యాయం చేయాలి

● సీఐటీయూ జిల్లా నాయకుడు చింతల శ్రీనివాసరావు

కొల్లిపర, జూలై 10 : అనుబంధ సంఘాల కార్మికులకు తగిన న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు చింతల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలకేంద్రం కొల్లిపర తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ అనుబంధ సంఘాల కార్మికులు తమ సమస్యల సాధన కోసం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడినప్పటికి కార్మిక వర్గానికి న్యాయం జరుగుతుందని నమ్మకం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్పులు చేశారని, వెంటనే వాటిని రద్దు చేయాలన్నారు. సీఐటీయూ నాయకుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు టెండర్ విధానాన్ని రద్దు చేసి రెగ్యులర్ చేయాలన్నారు. స్కీం వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులకు సీఐటీయూ అనుబంధ సంఘాల కార్మికులు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ జిల్లా కమిటీ నాయకులు నిర్మల, శివపార్వతీ, సీతమ్మ, లావణ్య, మీరాకుమారి, సీఐటీయూ నాయకులు కోటా చంద్రశేఖర్, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

అంజూమన్ ఏ ఇస్లామియా కమిటీ అధ్యక్షుడిగా అజీజ్

తెనాలి, మారీసుపేట జూలై 10: కొలకలూరు గ్రామ అంజూమన్ ఏ ఇస్లామియా కమిటి నూతన అధ్యక్షుడిగా అజీజ్ ఎన్నికయ్యారు. మండల పరిధిలోని కొలకలూరు గ్రామంలో అంజూమన్ ఏ ఇస్లామియా కమిటి నూతన పాలకవర్గాన్ని మజీద్ ఆక్సా మత పెద్దలు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ అజీజ్, కార్యదర్శిగా అమీర్‌బాష, ఉపాధ్యక్షుడిగా మస్తాన్, సంయుక్త కార్యదర్శిగా రీగా పఠాన్ కరీముల్లా, కోశాధికారిగా షేక్ బాష, కన్వీనర్‌గా రాయల్ ఖాజానజుద్దీన్‌లను నియమించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు అజీజ్ మాట్లాడుతూ ముస్లీంల అభ్యున్నతికి, సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మత పెద్దలు హాజి హహమ్మద్ హనీఫ్, హహబూబ్, కోళ్ళ కరిముల్లా, సిద్ధాంతి గౌసులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న వివిధ శాఖల ఉద్యోగులు, కార్మికులు

సీఐటీయూ అనుబంధ సంఘాల ధర్నా

తెనాలి అర్బన్, జూలై10 : స్థానిక చినరావూరు ధర్నా చౌక్ వద్ద సీఐటీయూ అనుబంధ సంఘాలు బుధవారం ధర్నా చేశారు. జాతీయ కోర్కెల దినోత్సవం పురస్కరించుకుని ఆయా సంఘాలు తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలంటూ ఆందోళన చేశారు. అంగన్‌వాడీ, మున్సిపల్, ఆటో, ఆర్టీసీ రిటైర్డ్, భవన నిర్మాణ రంగం, విద్యుత్ ఉద్యోగుల యూనియన్ల సభ్యులు ధర్నాలో పాల్గొన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు కొల్లిపర బాబుప్రసాద్ మాట్లాడుతూ, దేశ వ్యాప్త ఉద్యమంలో భాగంగా కార్యక్రమం చేపట్టామని దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలపై దృష్టి సారించాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు వేతనం అమలు చేయాలని, వివిధ ప్రభుత్వ పథకాలలో పని చేస్తున్న వారిని వర్కర్స్‌గా గుర్తించాలని, సంక్షేమ చట్టాలు వర్తింపజేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని, భవన కార్మికుల సంక్షేమానికి నిధులు కేటాయించాలన్నారు. 60 రకాల షెడ్యూల్ ఎంప్లాయ్‌మెంట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ సంస్థలను లీజుకు ఇచ్చే ప్రయత్నాలు మానుకోవాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. మంగళగిరి వెంకటేశ్వర్లు, ఎవిఎస్ కుమారి, షేక్ హుస్సేన్‌వలి, శ్రీనివాసరావు, శివశంకరరావు, సాంబశివరావు, వెంకటసుబ్బయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక కష్టాలకు సెలవ్ !

● ఉచిత ఇసుక పాలసీతో సామాన్యులకు ఊరట

● హర్షం వ్యక్తం చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

● నేతల చిత్రపటాలకు క్షీరాభిషేకం



నేతల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కూటమి నేతలు, కార్మికులు

పొన్నూరుటౌన్, జూలై10 : రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానంతో సామాన్యులకు ఇసుక కష్టాలు తీరిపోయాయని మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ ఆకుల సాంబశివరావు అన్నారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో బుధవారం కూటమి పార్టీల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌ల చిత్ర పటాలకు క్షీరాభిషేకాలు నిర్వహించారు. అనంతరం కూటమి పార్టీల నాయకులు, భవన నిర్మాణ రంగం కార్మికులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హాయాంలో ఐదేళ్ల పాటు ఇసుక దొరక్క పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ట్రాక్టర్ ఇసుక కోసం వేలాది రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఈ ప్రభావం భవన నిర్మాణ రంగంపై పడి కార్మికులకు పనులు దొరక్క, ఇబ్బందులు పడ్డారన్నారు. అలాగే లక్షలాది రూపాయలు వెచ్చించి లారీల ఇసుక కొనుగోలు చేసిన గృహ నిర్మాణ దారులపై అధిక భారం పడిందన్నారు. తమ కనుసన్నల్లో ఇసుక అమ్మకాలు సాగిస్తూ వైసీపీ నేతలు ఇసుక మాఫియాను నడిపారన్నారు. ఒకపక్క ఇసుక దొరక్క పనులు లేక నిర్మాణ రంగ కూలీలు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటే, మరోపక్క వైసీపీ నేతలు కోట్ల రూపాయలు దోచుకు తిన్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుక రూ.9500లకు విక్రయించారన్న విషయాన్ని గుర్తు చేసారు. ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక అమలు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన నెల రోజులోనే ఉచిత ఇసుక పాలసీని అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇసుక ఉచితంగా లభించటంతో నిర్మాణ రంగం ఊపందుకుని కూలీలకు పని దొరకటమే కాకుండా నిర్మాణ రంగం అభివృద్ధి చెందుతుందని హర్షం వ్యక్తం చేసారు. తమకు మంచి రోజులు తీసుకువచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపినట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు, భవన నిర్మాణ రంగ కార్మికులు ఇసుక లారీల యజమానులు పాల్గొన్నారు.

ఆటో, ద్విచక్రవాహనం ఢీ..

తెనాలి, రూరల్ జూలై 10: ఆటో, ద్విచక్రవాహనం ఢీ కొన్న ఘటనలో వ్యక్తికి గాయాలైన ఘటన బుధవారం నందివెలుగు ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొలకలూరు నందివెలుగు ప్రధాన రహదారిపై వస్తున్న ఆటో ఖాజీపేట మీదుగా వస్తున్న ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ద్విచక్రవాహనం నడిపే ఖాజీపేటకు చెందిన మల్లయ్యకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు తెనాలిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



మంచాలలో నేను బడికి పోతా ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ బోదన

చేబ్రోలు, జూలై10 : ప్రభుత్వ పాఠశాల్లో నిపుణులైన ఉపాధ్యాయుల చేత నాణ్యమైన విద్యా బోదన అందిస్తున్నట్లు మండల విద్యా శాఖ అధికారి ఏవీహెచ్ ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని మంచాల గ్రామంలో బుధవారం 'నేను బడికి పోతా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్యార్థుల చేత ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వం అందచేస్తున్న ఉచిత విద్య, తల్లికి వందనం, స్టూడెంట్ కిట్లు, మధ్యాహ్న భోజన పథకం వంటి వాటి గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో రాయల సుబ్బారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సుధాకర్‌ను సత్కరిస్తున్న ఆర్టీసీ డిపో అధికారులు, తోటి కార్మికులు

ఆర్టీసీ కండక్టరు సుధాకర్‌కి సత్కారం

తెనాలి రూరల్, జూలై 10: ఆర్టీసీలో బస్సు కండక్టర్‌గా పనిచేస్తూ ప్రయాణీకులను గౌవరంగా రిసీవ్ చేసుకుని వారి గమ్యస్థానాల్లో దిగే సమయంలో ధన్యవాదాలు తెలుపుతూ ప్రజల్లో బస్సు ప్రయాణం పట్ల ఆదరణ పెంచుతున్న పరుచూరి సుధాకర్ సేవలకు గానూ అధికారులు, సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించారు. సుధాకర్ తన సెల్‌ఫోన్ ద్వారా సోషల్ మీడియా గ్రూప్‌లో ప్రయాణీకులను రిసీవ్ చేసుకునే విధానంతో పాటు బస్సు వివరాలు, ఆర్టీసీ ప్రయాణంపై ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తూ సంస్థకు మంచి పేరు తెచ్చాలా కృషి చేస్తున్నాడు. ఇతడు సోషల్ మీడియాలో పెట్టిన పలు పోస్టలను రవాణాశాఖమంత్రి రాంప్రసాద్‌రెడ్డి చూసి కండక్టర్ సుధాకర్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. తెనాలి డిపో కార్మికులకు మంచి పేరుతెచ్చిన సుధాకర్‌ను డిపో అధికారులు, తోటి కార్మికులు దుశాలువాలతో ఘనంగా సత్కరించారు. ప్రతి ఒక్కరూ సుధాకర్‌ను స్ఫూర్తిగా తీసుకుంటే ఆర్టీసీ మరింతగా ప్రజల ఆదరణ పొందుతుందని పలువురు అభిప్రాయ వ్యక్తం చేశారు. ఆర్టీసీ డిపో డ్రైవర్లు, కండక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మనస్థాపంతో భర్త ఆత్మహత్య

తెనాలి రూరల్, జూలై 10: భార్యకాపురానికి రావడంలేదని మనస్థాపంతో భర్త ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం గుడివాడ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన తుమ్మల రవికుమార్(27)కు మూడేళ్ల క్రితం చుండూరు మండలం వలివేరు గ్రామానికి చెందిన ఓ యువతితో వివాహం జరిగింది. వీరికి ఒక పాప ఉంది. రవికుమార్ వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రవికుమార్‌కు మద్యం అలవాటు ఉండటంతో భార్య పలుమార్లు ఆ వ్యసనాన్ని మానాలని భర్తను కోరింది. అతడు మానకపోవడంతో సంవత్సరంన్నర క్రితం పుట్టింటికివెళ్లి అక్కడే ఉంటుంది. రవికుమార్ భార్యను కాపురానికి రావాలని పలుమార్లు కోరినా ఆమె రాకపోవడంతో మనస్థాపానికి లోనయ్యాడు. ఈ క్రమంలోనే ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కోటేశ్వరరావు పేర్కొన్నారు.

జగన్ మరోసారి జైలుకెళ్లక తప్పదు

● ఉచిత ఇసుకపై మాట్లాడే అర్హత అంబోతు రాంబాబుకు లేదు

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కనపర్తి

గుంటూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాం లో జరిగిన ఇసుక, మద్యం మైనింగ్ పాలసీలపై విచారణ జరిపితే వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి శాశ్వతంగా జైలుకెళ్లక తప్పదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న అన్నీ ఇసుక రీచ్‌లను గంపగుత్తగా ఒకే సంస్థకు కట్టబెట్టి వేల కోట్ల అవినీతికి పాల్పడ్డ జగన్మోహనరెడ్డిని, ఆయనకు అండ దండలందించిన ఉన్నతాధికారుల పైన విచారణ జరిపి వాస్తవాలను ప్రజలముందుంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని కనపర్తి అన్నారు. చంద్రబాబు ప్రవేశ పెట్టిన ఉచిత ఇసుక పథకంపై మాట్లాడే అర్హత అంబోతు రాంబాబుకు లేదన్నారు. తన కేసుల కోసం విభజన హామీలను ఢిల్లీ పెద్దల వద్ద తాకట్టుపెట్టిన జగన్, అధికారం పోగానే ప్రత్యేక హోదా గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. జగన్ నూతన ఇసుక విధానం పేరుతో 60 మంది భవన నిర్మాణ కార్మికులను పొట్టన బెట్టుకున్నాడని, ఎన్నికల సమయంలో పెన్షన్ల పేరుతో మరో 40 మంది వృద్ధులను తన స్వార్థానికి బలితీసుకున్నాడని కనపర్తి ఆరోపించారు. ప్రజల జీవనాడైన పోలవరాన్ని 20 సంవత్సరాలు వెనక్కు తీసుకెళ్లిన చరిత్ర హీనుడు జగన్ అని ఆయన విమర్శించారు.

లేబర్ కోడ్ చట్టాలను ఉపసంహరించుకోవాలి

● సీఐటీయూ నాయకుడు నిమ్మకూరి రమేష్ బాబు



సీడీపీవోకు వినతి పత్రం అందచేస్తున్న సీఐటీయూ నేతలు

పొన్నూరుటౌన్, జూలై 10 : కార్మిక వ్యతిరేక చట్టాలైన లేబర్ కోడ్‌లను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నాయకులు నిమ్మకూరి రమేష్ బాబు డిమాండ్ చేసారు. అఖిల భారత కోరికల దినం సందర్భంగా బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సీడీపీవో, రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు అందచేసారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ ప్రావిడెంట్ ఫండ్ చెల్లించని యజమానులపై ఎలాంటి చర్యలు లేకుండా కేంద్ర ప్రభుత్వం చట్టాల్లో మార్పులు తీసుకువచ్చిందని ఆరోపించారు. కార్మిక చట్టాల స్థానంలో యజమానులకు అనుకూలంగా, కార్మికులకు వ్యతిరేకంగా లేబర్ కోడ్ అమలులోకి తేవటం దారుణం అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విరమించుకోవాలని డిమాండ్ చేసారు. స్కీమ్ వర్కర్లైన అంగన్‌వాడీ మధ్యాహ్న భోజనం, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్ర శిక్షణ, వెలుగు, మెప్మా, ఉపాది హామి, ఆశా వర్కర్లకు కనీస వేతనాలు, పెన్షన్ సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ మధ్యాహ్న భోజన పథకాల కార్మికులు పాల్గొన్నారు.

మఖ నక్షత్ర సంపూర్ణ శాంతి పూజలు

తెనాలి, మారీసుపేట జూలై 10: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠం నందు శ్రీ సాలిగ్రామ మంఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ప్రజ్ఞానంద సరస్వతి (బాల స్వామి) భక్తులచే మఖ నక్షత్ర సంపూర్ణ శాంతి హోమాలను, ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలస్వామి నక్షత్ర శాంతి హోమ పూజలను చేయుట కలుగు ఫలితాలను వివరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో నంబురు వెంకట కృష్ణమూర్తి, గోపు రామకృష్ణ, నాగేశ్వరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా వీవీఐటీ 'జగన్నాథ రథయాత్ర'

పెదకాకాని, జూలై 10 : విశ్వ ప్రఖ్యాత పూరీ జగన్నాథుని రథయాత్రకు సంఘీభావంగా వివా, వీవీఐటీ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన 'జగన్నాథ రథయాత్ర' పెదకాకాని శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవాలయం నుంచి వీవీఐటీ కళాశాల వరకూ డప్పు వాయిద్యాలు, సాంప్రదాయ నృత్యాలు, భక్తబృందాల కోలాటాల నడుమ వైభవంగా బుధవారం సాగింది. వీవా వీవీఐటీ సంస్థల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, అరుణప్రియ దంపతులు సుభద్ర, బలభద్ర, సమేత జగన్నాథ రథాన్ని బంగారు చీపురుతో (చెరాపహరా) శుభ్రపరచి రథయాత్రను ప్రారంభించారు. వేలాది మంది భక్తులు, విద్యార్థులు, ఇస్కాన్ సభ్యుల భక్తిశ్రద్ధలతో, విదేశీ భక్తుల సంకీర్తనలు 'జై జగన్నాథ' నినాదాలతో ఈ వేడుక శోభాయమానంగా ముందుకు సాగింది. అనంతరం ఇస్కాన్ సభ్యులు వీవీఐటీ కళాశాల వద్ద దేవతామూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, మహాహారతి నిర్వహించి, విద్యార్థులు, భక్తులకు తీర్థప్రసాదాలు అందించి రథ



రథంలాగుతున్న వాసిరెడ్డి విద్యాసాగర్, తదితరులు

యాత్రను దిగ్విజయం చేశారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా శ్రీజగన్నాథ రథయాత్ర నిర్వహిసున్న ఏకైక విద్యాసంస్థ వీవా వీవీఐటీ అని గుర్తిస్తూ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ వారు ఇండియన్ వరల్డ్ రికార్డ్ పురస్కారాన్ని వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్‌కు అందించారు. కార్యక్రమంలో వీవా, వీవీఐటీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఇస్కాన్ ముంగళగిరి ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి రైతు బజారుల్లో

బియ్యం, కందిపప్పు విక్రయాలు



తహసీల్దార్ సూర్యనారాయణ సింగ్

పొన్నూరుటౌన్, జూలై 10 : రైతు బజారుల్లో నేటి నుంచి బియ్యం, కందిపప్పు విక్రయాలు ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ సూర్యనారాయణ సింగ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం పేదలకు సరసమైన ధరల్లో నాణ్యమైన సరుకులు అందించటమే లక్ష్యంగా ఈ విక్రయాలు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. దేశవాళి కందిపప్పు రూ.160, బీపీటీ/ సోనమసూరి స్టీమ్డ్ బియ్యం కిలో రూ.49, బీపీటీ / సోన మసూరి పచ్చి బియ్యం కిలో రూ.48లకే ఈ రైతు బజార్ల ద్వారా విక్రయించనునట్లు తెలిపారు. పేదలు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు బియ్యం కొన్నుగోలు చేయకుండా రైతు బజార్లను ఆశ్రయించి తక్కువ ధరకు నాణ్యమైన సరుకును పొందవలసినదిగా తహసీల్దార్ సూచించారు.

రైల్వే క్లెయిమ్స్ ట్రైబ్యునల్

అమరావతి శాఖలో లోక్ అదాలత్

గుంటూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట ఒకటో లైనులోని రైల్వే క్లెయిమ్స్ ట్రైబ్యునల్ అమరావతి శాఖలో నాలుగు రోజుల లోక్ అదాలత్ ప్రారంభమైంది. బుధవారం రెండోరోజున ట్రైబ్యునల్ సభ్యుడు (టెక్నికల్) జీ.జాన్ ప్రసాద్, మరో సభ్యురాలు సత్యభామ ఆధ్వర్యంలో పలు కేసులను పరిష్కరించారు. ఈ నెల 9వ తేదీన ప్రారంభమైన లోక్ అదాలత్ 12వ తేదీ వరకు కొనసాగుతుందని వారు చెప్పారు. రైల్వే సంబంధిత క్లెయిమ్‌లు, వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడమే ఈ అదాలత్ ముఖ్య లక్ష్యమన్నారు. ఈ అదాలత్‌ని చీఫ్ క్లెయిమ్స్ రవిప్రసాద్ పాడి, అదనపు రిజిస్ట్రార్ రాజేంద్రప్రసాద్ పర్యవేక్షించారు.

పెన్షనర్లకు ఒక్కక్లిక్‌తో ప్రభుత్వ సేవలు..

గుంటూరు, జూలై 10 : పెన్షనర్లకు ఒక్క క్లిక్‌తో ప్రభుత్వ శాఖల సేవలు సులభంగా అందుతాయని పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామాన్య పౌరులకు ప్రభుత్వ శాఖల సేవలు అందాలంటే ఒక యజ్ఞం చేసినట్టేనన్నారు. కొత్త వాహనానికి లైసెన్స్ రావాలన్నా, మున్సిపల్ పనులు, రెవెన్యూ కష్టాలు, రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, ఆఖరికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులను కలవాలన్నా సమస్యలేనన్నారు. అధికారుల చేతులు తడవందే పనులు కావని ఆరోపించారు. ఏ సమస్యకు ఏ అధికారిని కలిస్తే పనులు అవుతాయో తెలియని గందరగోళ ముంటుందన్నారు. ప్రభుత్వ విభాగాలన్నీ అంతర్జాలంలో వెబ్‌సైట్‌ను నిర్వహిస్తూ వినియో గదారులు ఫిర్యాదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నాయన్నారు. దక్షిణ ప్రాంత విద్యుత్ సంస్థ పరిధిలో విద్యుత్ శాఖ సిబ్బంది పౌరుల ఫిర్యాదులకు స్పందించకపోతే వినియోగదారులు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఎటువంటి సమస్యకైనా ఆయా వెబ్ సైట్స్‌లోకి వెళ్ళి సమస్యను తెలియజేయవచ్చన్నారు. ఆ సమస్యకు సంబంధించిన ఆధారాలను కూడా అప్‌లోడ్ చేసే అవకాశం ఉందన్నా రు. వివరాలు నమోదు చేసిన తర్వాత ఓ ఐడీ నెంబరు వస్తుందని, దాని ద్వారా మన ఫిర్యాదు ఏ దశలో ఉందో తెలుస్తుందన్నారు. సమ యానికి సరుకులు అందకపోయినా, గ్యాస్ సరఫరాలో ఆలస్యమైనా అంతర్జాలంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఏపీసివిల్‌సప్లయిస్.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్ళి ఫిర్యాదుల డబ్బాపై క్లిక్ చేయాలన్నారు. అనంతరం బాధిత వ్యక్తికి సంబంధించిన వివరాలు, ఫోన్ నంబరు నమోదు చేయాలన్నారు. తర్వాత ఫిర్యాదు చేసే విభాగంలోకి వెళ్ళి 250 పదాలతో సమస్యను రాయాలన్నారు. అప్పుడు ఐడీ నెంబరు వస్తుందని, దాంతో వివరాలు తెలుసుకోవచ్చని వీరయ్య తెలిపారు.

నేటి నుంచి త్రో బాల్ పోటీలు

● ప్రారంభించనున్న ఫాదర్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య

గుంటూరు(తూర్పు), జూలై 10 : గుంటూరు విద్యానగర్‌లోని స్టెప్ పాఠశాల ఆధ్వర్యంలో గురువారం నుంచి రెండు రోజులు పాటు ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల పరిధిలోని సీబీఎస్‌సీఈ పాఠశాలల త్రో బాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ ఫాదర్ భరత్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్ 14, 17, 19 బాలికల విభాగంలో ఈ పోటీలను జరుపుతున్నట్లు వివరించారు. ఈ పోటీలకు ఉమ్మడి రాష్ట్రాల నుంచి దాదాపు 600 మందికి పైగా క్రీడాకారులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం 9 గంటలకు పాఠశాల ఆవరణలో మొదలయ్యే ఈ పోటీలను గుంటూరు పీఠాధిపతులు ఫాదర్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య ప్రారంభిస్తారని ఫాదర్ భరత్‌రెడ్డి తెలిపారు.